శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు
వార్త



# పోక్సో కేసుల బాధితులకు అర్థిక సహాయం అందించడంలో నిర్లక్ష్యం తగదు

- అధికారులకు జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ హెచ్చరిక



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** పోక్సో కేసుల బాధితులకు అర్థిక సహాయం అందించడంలో నిర్లక్ష్యం వహించరాదని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ హెచ్చరించారు. శుక్రవారం కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణంలో సమగ్ర శిశు సంరక్షణ పథకం అమలుపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలపై చర్యల నివేదిక గురించి ఆరా తీశారు. దత్తత స్వీకరణ పిల్లల విషయంలో నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలన్నారు. బాల కార్మిక నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలని, చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ముఖ్యమైన ప్రదేశాలలో గుర్తించిన బాల యాచకులను బడిలో చేర్పించాలన్నారు. ఇందుకుగాను ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. యాచక వృత్తి చేసే బాలలకు స్పాన్సర్షిప్ పథకం గురించి అవగాహన కల్పించి వారు బడిలో చేరే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఐసిడిఎస్ పిడి హేనా సుజన్ డిసిపిఓ సురేష్, కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ విజయ్ కుమార్ రెడ్డి, దిశ సిఐ సుబ్బారావు, సమగ్ర శిక్ష పిడి వెంకటసుబ్బయ్య, డిపిఓ శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి విక్రయిస్తున్న రౌడీషీటర్లు అరెస్ట్

**నెల్లూరు క్రైమ్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** బారాషాహీద్ దర్గా సమీపంలో గంజాయి విక్రయించేందుకు గంజాయిని తరలిస్తున్న రౌడీషీటర్లు బాలమణికంఠ, వినయ్, వెంకటతేజ, ఛత్రపతి, ముక్తియార్, సంతోష్లను దర్గామిట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్దనుంచి తొమ్మిది కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఒకేసారి ఆరుగురు రౌడీషీటర్లను అదుపులోకి తీసుకోవడం నగరంలో సంచలనంగా మారింది.

## పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి హౌస్ అరెస్ట్



**నెల్లూరు రూరల్, ఆగస్టు 29, ప్రభాతవార్త** ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు పెట్టి రాక్షస ఆనందం పొందుతున్న కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యం బతికుందా, లేదా అన్న సందేహం కలుగుతోందంటూ ఆగ్రహం కావలి మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కుటుంబాన్ని పరామర్శించేందుకు వెళ్తున్న వైఎస్ఆర్సిపి నెల్లూరు సిటీ ఇంచార్జ్ ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ని పోలీసులు నెల్లూరు రాంజీ నగర్లోని ఆయన నివాసంలో హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతిపక్ష వైఎస్ఆర్సిపి నేతలపై అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టడం రాక్షస ఆనందం అవుతోందని మండిపడ్డారు. కావలిలో అక్రమాలను బహిర్గతం చేయడానికి ప్రయత్నించిన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డిపై అత్యాయత్నం కేసు పెట్టడం దారుణమని విమర్శించారు. తాము కార్యకర్తలకు భరోసా నింపడానికి కావలి వెళ్తుంటే అడ్డుకోవడం ప్రజాస్వామ్యంపై దాడి అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కావలికి వస్తే తలలు నరుకుతాం, చంపేస్తాం అని బెదిరించిన వారిని వదిలేసి, బెదిరింపులకు గురైన వారినే నిర్బంధించడం కూటమి ప్రభుత్వ దుర్మార్గ పాలనకు నిదర్శనమన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా వైఎస్ఆర్సిపి వెనకడుగు వేయదని, ప్రభుత్వ అరాచకాలకు వ్యతిరేకంగా పోరాటం కొనసాగుతుందని పర్వత రెడ్డి స్పష్టం చేశారు.

## రెండవ రోజు కొనసాగిన నిండిగుంట అరుణ విచారణ



**కోవూరు , ఆగస్టు 29 ప్రభాతవార్త :** లేడీ డాన్ నిడిగుంట అరుణను రెండవ రోజు కూడా విచారణ నిమిత్తం నెల్లూరు జైలు నుంచి కోవూరు పోలీస్స్టేషన్కు తీసుకునివచ్చారు. శుక్రవారం విచారణలో అడిషనల్ ఎస్పీ సౌజన్య ఆధ్వర్యంలో రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాస్ పూర్తిస్థాయిలో విచారణ చేపడుతున్నారు. ప్రధానంగా ఇటీవల కోవూరు రాళ్లమిట్టకు చెందిన పలువురు గిరిజనులకు ఇళ్ల పట్టాలు ఇప్పిస్తామని 2.10 లక్షలు అరుణ తీసుకున్నట్లు ఇటీవల ఫిర్యాదు రావడంతో దీనిపై కూడా పోలీసులు ఆరా తీస్తున్నారు. రెండవ రోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విచారణ కొనసాగింది. పోలీస్ ఉన్నతాధికారులు ఇచ్చిన పలు సూచనల మేరకు రెండవ రోజు సుదీర్ఘంగా విచారణ చేపడుతున్నారు. రెండవ రోజు విచారణలో కోవూరు సీఐ సుధాకర్రెడ్డి, సీఐ నాగేశ్వరమ్మ, ఎస్సై రంగనాథ్ గౌడ్లు కూడా ఈ విచారణలో పాల్గొన్నారు. మొత్తం మీద రెండవ రోజు విచారణలో పోలీసులు కొన్ని కీలకమైన సమాచారం రాబట్టినట్లు విశ్వసనీయంగా తెలియవచ్చింది.

## ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థలో మొట్టమొదటి కంటైనర్ సబ్ స్టేషన్కు నేడు



**నెల్లూరు, ఆగష్టు 29, ప్రభాతవార్త - వైద్యం** శుక్రవారం విద్యుత్ భవన్లో జిల్లా సూపరింటెండెంట్ ఇంజనీర్ వి.విజయన్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ మొట్టమొదటి కంటైనర్ సబ్ స్టేషన్ను నెల్లూరులో ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మంత్రి పొంగూరు నారాయణ కృషి వల్ల ఇది సాధ్యమైందని ఉదయం 10గంటలకు గాంధీ బొమ్మ సెంటర్లో మంత్రి శంకుస్థాపన కార్యక్రమాన్ని చేస్తున్నట్లు తెలియజేశారు. ఈ కంటైనర్ సబ్ స్టేషన్ తక్కువ స్థలంలో ఏర్పాటు చేయడానికిసులువుగా ఉంటుందని, సిటీ లో ఓపెన్ సబ్ స్టేషన్ కట్టడానికి అనువైన స్థలం ఉండదు కాబట్టి తక్కువ స్థలంలోనే సబ్ స్టేషన్ నిర్మించవలసి ఉంటుందని అందువల్ల మోడల్గా నెల్లూరు జిల్లాలో మొట్టమొదటి కంటైనర్ సబ్ స్టేషన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలియజేశారు. దీని ద్వారా వినియోగదారులకు మరింత మెరుగైన సరఫరా ఇచ్చేందుకు ఉపయోగపడుతుందని తెలియజేశారు.

## మద్యం బార్లు కోసం కేవలం 18 దరఖాస్తులు

**నెల్లూరు క్రైం, ఆగస్టు 29, ప్రభాతవార్త :** జిల్లాలోని 55 బార్లుకు గాను 18బార్లకు దరఖాస్తులు దాఖలయ్యాయి. ఇందులో నెల్లూరు నగరంలో 10 బార్లకు, కావలిలో రెండు బార్లకు, కందుకూరులో మూడు బార్లకు దరఖాస్లులు అందినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు. గీత కులాలకు సంబంధించి నెల్లూరులో రెండు, కావలిలో ఒకటి, కందుకూరులో ఒక బారుకు దరఖాస్తులు వచ్చినట్లు పేర్కొన్నారు. నేడు జెడ్పీ కార్యాలయంలో లాటరీ ద్వారా బార్లను కేటాయించేందుకు ఎక్సైజ్ శాఖ ఏర్పాట్లు చేసింది

## నూతన చైర్మన్ మనుబోలు శ్రీధర్రెడ్డికి ఘనమైన సత్కారం



**నెల్లూరు అగ్రికల్చర్, ఆగష్టు 29, ప్రభాతవార్త** నెల్లూరు వ్యవసాయ మార్కెట్కమిటీ నూతన ఛైర్మన్గా ఎన్నికైన మనుబోలు శ్రీధర్రెడ్డి ప్రమాణ స్వీకారోత్సవంలో ఆయనను కూటమి నేతలు, అభిమానులు, కార్యకర్తలు శాలువాలు కప్పి పూలబొకేతో ముంచెత్తారు. ఆయన కోసం ప్రత్యేకంగా తీసుకొచ్చిన మాటలను మెడలో వేసి ఆనందించారు. యువనేత శ్రీధర్రెడ్డికి జై అంటూ నినాదాలు చేశారు. వందలాది మంది కూటమి నేతలు, అభిమానులు ఆయనను ఘనంగా సత్కరించారు. రూరల్ నియోజకవర్గంలోని పెద్ద చెరుకూరుకు చెందిన మనుబోలు శ్రీధర్రెడ్డి, తొలిసారిగా చైర్మన్ పదవి చేపట్టిన సందర్భంగా కార్యకర్తలు, అభిమానుల సన్మానాల వెల్లువ కొనసాగింది. అభిమానుల సత్కారాల వెల్లువలో ఆయన ఆనందాన్ని ఆశ్వాదించారు. నేతలు, కార్యకర్తలు నాపై చూపిన అభిమానానికి ధన్యుడనని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. నాకు చైర్మన్ పదవినిచ్చి గౌరవాన్ని కల్పించిన రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్రెడ్డికి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధర్రెడ్డికి, జనసేత రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్కి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని చెప్పారు. నెల్లూరు అగ్రికల్చర్ మార్కెటి కమిటీ చైర్మన్గా, శక్తి వంచన లేకుండా కృషి చేసి మార్కెటింగ్ రంగాన్ని లాభసాటిగా మారుస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## ఎమ్మెల్యే హత్యకు కుట్ర వీడియో వైరల్

**నెల్లూరు క్రైమ్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** రౌడీ షీటర్ జగదీష్ మరికొందరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి హత్యకు కుట్ర పన్నినట్లుగా ఓ వీడియో సామాజిక మాధ్యమాల్లో హల్ చల్ చేస్తోంది. జగదీష్తో పాటు మరికొందరు ఈ వీడియోలో మాట్లాడుకుంటూ రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డిని హత్య చేస్తే డబ్బులే డబ్బులు అని వ్యాఖ్యానిస్తుండడం, ఈ సంభాషణలను మరొక వ్యక్తి వీడియో తీస్తూ కనిపించారు. ప్రస్తుతం ఈ వీడియో నెల్లూరు నగరంలో సంచలనంగా మారింది.

## గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలపై నివేదిక సిద్ధం చేయాలని మంత్రి ఆదేశం

- పలు శాఖల విభాగాధిపతులకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు దిశ నిర్దేశం చేసిన మంత్రి నారాయణ
- గత వైసిపి ప్రభుత్వ పనితీరుపై తీవ్రస్థాయిలో మండిపడ్డ మంత్రి
- నియోజకవర్గాల్లోని వైసిపి నేతల తీరుపై మంత్రికి ఫిర్యాదు చేసిన ఎమ్మెల్యేలు
- అర్బన్ డెవలప్మెంట్ అథారిటీని నిర్వీర్యం చేసిన గత వైసిపి ప్రభుత్వం
- పనులేమీ జరగకుండానే డబ్బులు డ్రా చేసిందంటూ మంత్రి మండిపాటు
- ఎల్ఆర్ఎస్ లో వచ్చిన మొత్తాన్ని నియోజకవర్గ అభివృద్ధి కృషి చేయాలని ఆదేశించిన మంత్రి నారాయణ
- ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరిక
- కొత్త లేఔట్ లో 10 శాతం స్థలం పార్కు, దేవాలయాలకు వదలాలని ఆదేశం
- గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలపై విచారణకు నివేదికలు



**నెల్లూరు కార్పొరేషన్, ఆగస్టు 29, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఎమ్మెల్యేలు, నుడా, కార్పొరేషన్ ,జిల్లా అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. పలు శాఖల విభాగాధిపతులతో కీలక అంశాలపై మంత్రి సుదీర్ఘంగా చర్చించారు. ఈ క్రమంలో ఆయా నియోజకవర్గాల్లో వైఎస్సార్సీపీ చేసిన అక్రమాలను మంత్రికి ఎమ్మెల్యేలు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవకతవకలపై విచారణ చేసి నివేదిక సిద్ధం చేయమని మంత్రి ఆదేశించారు. ఈ సందర్భంగా రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మాట్లాడుతూ గత ప్రభుత్వం అనేక అవకతవకలకు పాల్పడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్ని వ్యవస్థలను సర్వనాశనం చేసిందని మండిపడ్డారు. అర్బన్ డెవలప్మెంట్ ఆథారిటీలని నిర్వీర్యం చేసిందని, ఎలాంటి అభివృద్ధి పనులు జరగకుండానే డబ్బులు డ్రా చేసేసిందని దుయ్యబట్టారు. దీనిపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఎమ్మెల్యేలు కోరారగా త్వరలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. ఎవరూ నష్టపోకూడదని ఎల్ ఆర్ ఎస్ ను అందుబాటులోకి తెచ్చామన్నారు. సెట్ బ్యాక్స్, లేఔట్లు, బిల్డింగ్స్ కి అనేక అనుమతులు, అవకాశాలు ఇచ్చామని తెలిపారు. దీన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎల్ఆర్ఎస్ లో వచ్చిన మొత్తాన్ని ఆ నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ స్థలాలు అక్రమిస్తే చర్యలు తప్పవని మంత్రి హెచ్చరించారు. కొత్త లేఔట్స్ లో 10 శాతం స్థలం పార్కు, దేవాలయాలకు వదిలేయాలని స్పష్టం చేశారు. అనంతరం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కావలి ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి, కందుకూరి ఎమ్మెల్యే ఇంటూరు నాగేశ్వరరావు, నూడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడారు. ఈ సమీక్ష సమావేశంలో కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్, ఆర్డీవో అనూష, కమీషనర్ నందన్, కందుకూరు సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కావ్య క్రిష్ణా రెడ్డి, ఇంటూరి నాగేశ్వర రావు, నుడా చైర్మెన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి, రూరల్ టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

## నెల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

- నూతన కమిటీ మార్కెటింగ్ రంగాన్ని, గతం కంటే లాభసాటిగా మార్చేందుకు కృషి చేయండి
- అప్పులున్నా, రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమం ఆగదు
- రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నాం
- ఈ డిసెంబర్ కల్లా నెల్లూరులోని 54డివిజన్లలో నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు అందిస్తాం
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడి





**నెల్లూరు అగ్రికల్చర్, ఆగష్టు 29, ప్రభాతవార్త** నెల్లూరులోని మాగుంట లేఅవుట్లో ఉన్న చెరుకుపల్లి పిచ్చిరెడ్డి కళ్యాణ మండపంలో నెల్లూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం కన్నుల పండువగా జరిగింది. ఈ కార్యక్రమానికి పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. నూతన కమిటీచైర్మన్ మనుబోలు శ్రీధర్రెడ్డికి, డైరక్టర్లకు శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1971లో మార్కెటింగ్ రంగంలో వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ పాలన ప్రారంభమైందన్నారు. అప్పటి నుండి ఇప్పటి వరకు ఎన్నో కమిటీలు లాభార్జనకు కృషి చేశాయని వివరించారు. చైర్మన్ మనుబోలు శ్రీధర్రెడ్డి నేతృత్వంలో ప్రస్తుత నూతన కమిటీ అంతకంటే మిన్నగా పని చేసి మార్కెటింగ్ వ్యవస్థను లాభాల్లోకి తీసుకురావాలని సూచించారు. రాష్ట్రం అప్పుల్లో ఉన్నా ప్రభుత్వం హామీల అమలులో వెనుకంజ వేయలేదని వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం 10 లక్షల కోట్ల అప్పులను మిగిల్చి వెళ్లిందని, ప్రస్తుత ప్రభుత్వంలో ప్రజలు కట్టే పన్నులను ఆ అప్పులు తీర్చేందుకు జమ చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలాంటివని, ఎన్ని అప్పులున్నా, అభివృద్ధి సంక్షేమం ఆగదన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం సూపర్ సిక్స్ అమలుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలియజేశారు. అభివృద్ధిని ఒక వైపు కొనసాగిస్తూ, రైతు సంక్షేమం కోసం ఈ ప్రభుత్వం పాటుపడుతుందని గుర్తు చేశారు. అందుకోసమే రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఏడాదికి 20 వేల రూపాయల సాయం అందిస్తామన్న హామీని నెరవేరుస్తున్నామని వెల్లడించారు. నేను పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్నా కూడా నా కన్నా స్పీడుగా రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్రెడ్డి నియోజకవర్గంలో 200 కోట్ల పనులకు టెండర్లు పిలిచారని తెలిపారు. ఆయన అభివృద్ధిలో దూసుకుపోతున్నారని కొనియాడారు. మరో 350 కోట్లు నెల్లూరు నగరాభివృద్ధికి అమృత్ పథకం ద్వారా నిధులు సమకూరుతాయని చెప్పారు. గతంలో 2014-19 లో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 1100 కోట్ల రూపాయల ఖర్చుతో సోమశిల నీళ్లను నెల్లూరుకు తీసుకొచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నిధులు విడుదల చేస్తే, గత వైసీపీ ప్రభుత్వం ఆ పనులను మా మీద కోపంతో ఆపేసిందని వెల్లడించారు. వచ్చే డిసెంబర్ నాటికి నెల్లూరు నగర ప్రజలకు 54 డివిజన్లలో నిరంతరం స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్రెడ్డి మాట్లాడుతూ జిల్లా అభివృద్ధిలో మంత్రి పొంగూరు నారాయణ సహకారం మరువలేనిదన్నారు. ఆయన సహకారంతోనే అర్బన్లో ఉన్న రూరల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకొస్తున్నానని వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పొంగూరు నారాయణ సహకారంతో నే నెల్లూరు అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పొంగూరు నారాయణ, పని రాక్షసుడని, ఆయన ధ్యాస అంతా అభివృద్ధి వైపే ఉంటుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నారా లోకేష్తో కలిసి దేశ విదేశాలు తిరిగి, రాష్ట్రానికి పరిశ్రమలు తీసుకొచ్చేందుకు కృషి చేయడం సంతోషదాయకమన్నారు. ప్రస్తుత మార్కెటింగ్ కమిటీ ప్రభుత్వ గౌరవాన్ని పెంచే విధంగా నడుచుకుంటూ లాభర్జనకు కృషి చేయాలని సూచించారు. అనంతరం రాష్ట్ర వక్ఫ్బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ కార్యకర్తలు వాళ్ల సంక్షేమం గురించి ఆలోచించే ఏకైక నాయకుడు కోటంరెడ్డి శ్రీధర్రెడ్డి అని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు కోటంరెడ్డి గిరిధ్రెడ్డి, నేతలు రూప్ కుమార్యాదవ్, కోడూరు కమలాకర్రెడ్డి, భానుశ్రీ, జలదంకి సుధాకర్, వేమిరెడ్డి సురేంద ర్రెడ్డి, ఇందుపూరు శ్రీనివాసులురెడ్డి, నారాయణ విద్యా సంస్థల జనరల్ మేనేజర్ విజయభాస్కర్రెడ్డి, జెన్ని రమణయ్య, క్లస్టర్ ఇన్ఛార్జీలు, కోక్లస్టర్ ఇన్ఛార్జీలు, కార్పొరేటర్లు, సర్పంచ్లు, ఎంపీటీసీలు, డివిజన్ అధ్యక్షులు, టీడీపీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, బీజేపీ, జనసేనపార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నెల్లూరు నగర ప్రజలకు సురక్షిత నీరు అందించడమే లక్ష్యం

**నెల్లూరు, ఆగష్టు 29, ప్రభాతవార్త** రాష్ట్రంలో అరాచక పాలన సాగించిన గత వైసీపీ ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో నెల్లూరులోని పలు అభివృద్ధి పనులకు సంబంధించి రూ.135 కోట్ల మేర అప్పులు పాలు చేసిందని రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ మండిపడ్డారు. నెల్లూరు నగర పరిధిలోని 14వ డివిజన్ జగదీష్ నగర్ పార్కు వద్ద ఆదానీ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ సుజల సురక్షిత తాగునీటి పథకాన్ని శుక్రవారం మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. డివిజన్కు విచ్చేసిన మంత్రికి స్థానిక ప్రజలు, టీడీపీ శ్రేణులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ 2014-2019 ఏడాదిలోనే ఆరు మదర్ ప్లాంట్లు, 60 చిన్న ప్లాంట్ల ఏర్పాటుకు రెండు కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందన్నారు. దాంతో నగర వాసులకు ఆరు లక్షల లీటర్లను అందజేసే విధంగా పనులు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. అయితే గత ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో ఆ పనులను పట్టించుకోకుండా మూలన పడేసి తీరని నష్టానికి దారి తీసిందన్నారు. అయితే ప్రజా ఆశీస్సులతో అధికారం చేపట్టిన వెంటనే సుపరిపాలన దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందని మంత్రి తెలియజేశారు. ఆ క్రమంలోనే నెల్లూరు నగరంలో ఆగిపోయిన పనులు తిరిగి ప్రారంభించి నగర పరిధిలో మూడు మదర్ ప్లాంట్లు, 60 చిన్న ప్లాంట్ల ద్వారా ఒక్కొక్క ప్లాంట్ నుండి ఒక లక్ష లీటర్ల నీటిని రూపాయకే 20 లీటర్లు అందించే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. 60 చిన్న ప్లాంట్ల విషయంలో పది ప్లాంట్లు ప్రారంభించగా మరి నాలుగు ప్యాంటు రెడీగా ఉన్నాయని మరో 20 ప్లాంట్లు ప్రాసెస్ లో ఉన్నాయని తెలిపారు. రానున్న రెండు మూడు మాసాల కాలంలో అన్ని ప్లాంటును పూర్తి చేసి ప్రజలకు అంకితం చేయడం జరుగుతుందన్నారు. గతంలో సంగం వద్ద నుండి 550 కోట్ల రూపాయలతో మంచినీటిని అందించే విధంగా చర్యలు చేపట్టడం జరిగిందని, అదే విధంగా మరో 550 కోట్ల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టం ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఆ పనులకు సంబంధించి పెండింగ్లో ఉన్న 165 కోట్ల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసిందని, అందులో మెగా, ఎల్అండ్టీ కంపెనీలకు 30 కోట్లు అందించే విధంగా నిదులు మంజూరు కాబడ్డాయని తెలిపారు. డిసెంబర్ 2025 నాటికి పనులు పూర్తి చేసి 100 శాతం, 54 డివిజన్లకు తాగునీటిని అందించడం జరుగుతుందన్నారు. అదే విధంగా రానున్న ఒక సంవత్సరం కాలంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. కాలువల వద్ద దోమలు చేరకుండా ఉండే విధంగా మరో 50 కోట్లు అదనంగా వెచ్చించి అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. 2026 జూన్ నాటికి జిల్లాలోని పాఠశాలను ఆధునీకరించి అందుబాటులోకి తేవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. స్థానిక నాయకులు కోరిక మేరకు 16వ డివిజన్లో రోడ్లు ఏర్పాటుకు అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన మంచి పనులు అన్నింటిని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆపేసిందని తిరిగి వాటిని పునరుద్ధరించడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే నెల్లూరు నగరంలో అన్నా క్యాంటీన్లను పునఃప్రారంభించామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనలో ప్రజలు అన్నింటి నష్టపోయారని ధ్వజమెత్తారు. అయితే కూటమి ప్రభుత్వం ప్రజలకు చెప్పిన మాట ప్రకారం సుపరిపాలన అందిస్తుందని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్ర వర్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ జగదీషన నగర్లఓ ఎన్టీఆర్ సుజల మంచినీటి పథకాన్ని ప్రారంభించడం సంతోషదాయకమన్నారు. 2024-2019 కాలంలో ఈ పథకాలకు ప్రారంభోత్సవం జరిగిందని గుర్తు చేశారు. సీఎస్ఆర్ నిధులతో 60 ప్లాంట్లో ఏర్పాటు చేయనుండగా 10 ప్లాంట్ను స్టార్ట్ చేసుకోవడం జరిగిందన్నారు. ఆదాని గ్రూపు ఫౌండేషన్ నుంచి నాలుగు కోట్ల రూపాయలు వెచ్చించడం జరుగుతుందని తెలిపారు. నారాయణ అంటేనే అభివృద్ధి అని అభివృద్ధి అంటే నారాయణ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్తో పాటు డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, టీడీపీ సీనియర్ నేత విజయ భాస్కర్రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతారెడ్డి, కార్పొరేటర్ శ్రీకాంత్రెడ్డి, టీడీపీ ప్రెసిడెంట్ సాయి, టీడీపీ ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## సంపూర్ణ అక్షరాస్యతకు కృషి చేయండి



**మనుబోలు ఆగష్టు 29 ప్రభాతవార్త :** సంపూర్ణ అక్షరాస్యతకు వాలింటర్లు కృషి చేయాలని ఎంఇఒ జె ఓబులు సూచించారు. మనుబోలు ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా వాలింటర్లకు శిక్షణ ఇచ్చారు. మండలంలో 2353 నిరక్షరాస్యులను గుర్తించామన్నారు. 29 గ్రామాలలో ఇందుకోసం 180 మంది వాలింటర్లని నియమించామన్నారు. నిరక్ష రాస్యులను అక్షరాస్యులుగా తీర్చి దిద్దాలన్నారు. వయోజన విద్య ట్రైనర్ రామ్మోహన్‌రావు ఎలా చదువు చెప్పాలి ఎలా నేర్పించాలో శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఇంచార్జి ఎంపిడిఒ ముజీబున్నీసా ఏపివో రాజమ్మ ఎపిఎం వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.

## కిలో ఉల్లిపాయలు 12 రూపాయలు మాత్రమే



**కావలి, ఆగస్టు29, ప్రభాతవార్త:** ప్రభుత్వం కిలో ఉల్లిపాయలు 12 రూపాయలకు అందిస్తుందని రైతు బజార్ ఈఓ మధుబాబు కోరారు. ఈ సందర్భంగా మధుబాబు శుక్రవారం మాట్లాడారు కావలి రైతు బజార్ నందు ఉల్లిపాయలు స్టాక్ ఉందని ప్రజలందరూ వచ్చి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలానే ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా నాణ్యమైన ఉల్లిపాయలను తక్కువ ధరకు అందించాలనే దృడసంకల్పంతో ఉందని దీంతో ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలియజేశారు

## గణేష్ నిమజ్జనాల్లో అపశృతి



**కావలి, ఆగస్టు 29, ప్రభాతవార్త:**కావలి రూరల్ మండలం తుమ్మలపెంట సముద్రం తీరం నందు శుక్రవారం గణేష్ నిమజ్జన కార్యక్రమం భారీ ఎత్తున వినాయకుని విగ్రహాలు నిమజ్జనానికి తీసుకొని రావడం జరిగింది వినాయకుని నిమజ్జనాలు చేస్తుండగా జలదంకి చెందిన మహేష్ అనే యువకుడు పొరపాటున సముద్రంలో మునిగిపోయాడు ఈ విషయాన్ని గమనించిన మెరైన్ పోలీసులు సకాలంలో స్పందించి మెరైన్ ఎస్ఐ జానకిరామ్ ఆధ్వర్యంలో వారి సిబ్బంది నరేంద్ర మరియు ఎ.ఎస్.ఐ లు యువకుడ్ని ప్రాణాలతో ఒడ్డుకి చేర్చారు అక్కడికి వచ్చిన ప్రజలు , భక్తులు అందరూ మెరైన్ పోలీసులను అభినందించడం జరిగింది

## ఘనంగా మేజర్ ధ్యాన్ చంద్ జయంతి వేడుకలు



**కావలి, ఆగస్టు 29, ప్రభాతవార్త:**మేజర్ ధ్యాన్ చంద్ జయంతి వేడుకలు కావలి జవహర్ భారతికళాశాల క్రీడా ప్రాంగణం నందు శుక్రవారం ఘనంగా నిర్వహించడం జరిగింది ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించడం జరిగింది ఈ సందర్భంగా జవహర్ భారతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి సుబ్రహ్మణ్యం నాయుడు మాట్లాడారు భారత ప్రభుత్వం ధ్యాన్ చంద్ జయంతిని జాతీయ క్రీడా దినంగా ప్రకటించడం జరిగినదన్నారు మనందరం జాతీయ క్రీడాకారుడి వారి క్రీడా నైపుణ్యాలను జ్ఞాపకం చేసుకునేందుకు భారత జాతీయ క్రీడా దినంగా జరుపుకోవడం అనువాయితీగా వస్తు ఉన్నదన్నారు ఈ కార్యక్రమంలో జవహర్ భారతి డిగ్రీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ రెడ్డి పలువురు కళాశాల క్రీడాకారులు మరియు వాకర్స్ పాల్గొన్నారు

## పంచాయితీ పురోగతిపై శిక్షణ



**మనుబోలు ఆగష్టు 29 ప్రభాతవార్త :** మనుబోలు ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం పంచాయితీ పురోగతిపై తీసుకోవాల్సిన చర్యల గురించి సర్పంచులకు పంచాయితీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈకార్యక్రమాన్ని మనుబోలు సర్పంచ్ కంచి పద్మమ్మ గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటి ఎంపిడిఒ నారాయణ మాట్లాడుతు 2023-24 సంవత్సరానికి కేంద్ర ప్రభుత్వం సూచించిన సూచికలను ఆధారంగా అభివృద్ధి గురించి ఆన్‌లైన్‌లో డేటాను నమోదు చేశామన్నారు. ఇందులో ఏమైనా మార్పులు కరెక్షన్స్ చేయాలన్నా ఎలా చేయాలని శిక్షణ ఇచ్చారు. అలాగే క్షేత్రస్దాయిలో వివిధ శాఖల ద్వారా జరిగిన అభివృద్దిని నమోదు చేయాలన్నారు. దీని ఆధారంగా జిడిపి అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసి పంచాయితీకి అభివృద్ధికి గ్రేడ్లు ఇస్తారన్నారు. దాని ఆధారంగా నేషనల్ పంచాయితీ అవార్డులకు కూడా ఎంపిక చేస్తారని తెలిపారు. ఈకార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపిడిఒ ముజీ బున్నీసా, ఏఈలు, కసనా నాయక్ ,విజయ్‌బాస్కర్ పంచాయితీ కార్యదర్శులు ,గరదుయ్య, శ్రావణి, ఏపిఒ రాజమ్మ, తదితరులు పాల్గోన్నారు.

## క్రమం తప్పకుండా లార్వా సర్వే, ఫీవర్ సర్వే చేపట్టండి



**నెల్లూరు, ఆగష్టు 29, ప్రభాతవార్త -వైద్యం :** జిల్లా మలేరియా అధికారిణి హుస్సేనమ్మ శుక్రవారం రామచంద్రాపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ల్యాబ్‌లో పాసివ్ రిజిస్టర్, ఆక్టివ్ రిజిస్టర్‌లు పరిశీలించి పాసివ్ స్లైడ్‌లను 24 గంటలలో పరీక్ష చేయాలని, ఆక్టివ్ స్లైడ్‌లను ఆరోగ్య కార్యదర్శి, ఎంపీహెచ్ఏ(ఎం) వారీగా విడివిడిగా నెలవారీగా 3 నెలల భద్రపరచాలని, ప్రతి రోజు మైక్రోస్కోప్‌ను తడుచుకొని, స్లైడ్‌లను పరీక్ష చేయాలని, రిజిస్టర్‌లను ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని, ప్రతి ఎంపీహెచ్ఏ తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో రక్త పూతలను తీసి ల్యాబ్ కు ప్రతి భుదవారం, ప్రతి శనివారం ఇచ్చేలా యుపీహెచ్‌సీ ప్రతి సమావేశంలో తెలియజేయాలని, అలాగే క్షేత్ర స్థాయిలో అవసరం అయినప్పుడు ఆర్‌డీటీ కిట్ ద్వారా కూడా పరీక్ష చేయాలని సూచించారు. అలాగే రాయపు పాలెం నందు లార్వా సర్వేను పరిశీలించి లార్వాలను గుర్తించి, ఎంపీహెచ్ఏ(ఎం అండ్ ఎఫ్)లు, ఆశా కార్యకర్తలు సక్రమంగా ప్రతి రోజు లార్వా, ఫీవర్ సర్వే చేయాలని, లార్వా, ఫీవర్, రిజిస్టర్‌లలో నమోదు చేయాలని ఆదేశించారు. ఫ్రైడే డ్రైడే పట్ల, పరిసరాల పరిశుభ్రత గురించి అవగాహన కల్పించాలని, మున్సిపల్ శానిటరీ వారి చేత కాలువలను శుభ్రం చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సహాయ మలేరియా అధికారి నాగార్జునరావు, పట్టణ సబ్ యూనిట్ అధికారి శాంసన్, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆరోగ్య సహాయకులు వెంకటేశ్వర్లు, పట్టణ మలేరియా సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## దివ్యాంగుల ఫించనుదారులకు అప్పీలకు అవకాశం

**- ఎంపీడీవో లేదా కమిషనర్‌కు అప్పీలకు అవకాశం - డిఆర్డిఏ పిడి నాగరాజ కుమారి**



**నెల్లూరు కలెక్టరేట్, ఆగష్టు 29, ప్రభాతవార్త :** దివ్యాంగుల పించనుదారుల అప్పీలు దాఖలు చేసుకొనుటకు అవకాశము ప్రభుత్వం నుండి అందిన తాజా సమాచార ప్రకారం, గత గత కొద్ది రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా దివ్యాంగుల పించనుదారుల పునఃమూల్యాంకన కార్యక్రమం నిర్వహించబడుతోందని ఈ కార్యక్రమం కింద సంబంధిత వైద్య అధికారుల ద్వారా ఫించనుదారుల వైద్య పరీక్షలు నిర్వహించబడి, వారి శారీరక అంగవైకల్య స్థితిని తిరిగి అంచనా వేయడం జరిగింది. ఈ పునఃమూల్యాంకన ప్రక్రియ అనంతరం, కొంతమంది దివ్యాంగుల ఫించనుదారుల పించన్లు రద్దు చేయబడ్డాయి లేదా వారి పెంచన్ యొక్క ప్రాతిపదిక మార్పు చేయబడ్డది. ఈ నేపథ్యంలో, అటువంటి దివ్యాంగుల పెంచనుదారులు, వారికి అర్హత ఉన్నదని భావించిన యడల, సంబంధిత యం.వి.డి.ఓ.లేదా మున్సిపల్ కమిషనర్లు వారి వద్ద అప్పిల్ దాఖలు చేసుకొనే అవకాశం కల్పించబడిందని. తగిన ఆధారాలు మరియు అవసరమైన పత్రాలు జతచేసి అప్పిల్ సమర్పించగలరు. ఈ ప్రక్రియ ద్వారా మీ పునఃమూల్యాంకన నిర్ణయాన్ని పునః పరిశీలించేందుకు అవకాశం లభిస్తుంది. తమకు ఫించన్ అందడానికి అర్హత ఉందని భావించే దివ్యాంగులు తక్షణమే సంబంధిత అధికారుల వద్ద అప్పిల్ దాఖలు చేయవలెనని, డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ నాగరాజకుమారి ఓ ప్రకటనలో తెలిపారు.

## యంగ్ సైనిటిస్టు ఇండియాకు ఎంపికైన చేజర్ల లుంబిని విద్యార్ధి



**చేజర్ల ఆగష్టు 29 ప్రభాతవార్త :** అత్యంత ప్రతిష్టాత్మకమైన యంగ్ సైనిటిస్టు ఇండియా 11 వ ఎడిషన్‌కు చేజర్ల మండలంలోని లుంబిని ప్రవేటు విద్యాలయంలో 9 వ తరగతి చదువుతున్న దాడి చరణ్ శుక్రవారం ఎంపికైయ్యారు. చెన్నైలో నిర్వహించిన ప్రిలిమ్స్ ప్రవేటు కేటగిరి నందు ఎంపికైనట్లు పాఠశాల యాజమాన్యం ఒక ప్రకటనలో పేర్కున్నారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బి రామయ్య, ఉపాధ్యాయని, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తు విద్యార్ధికి అభినందనలు తెలిపారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**- ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం - నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా**



**నెల్లూరు కలెక్టరేట్, ఆగష్టు 29, ప్రభాతవార్త :** జిల్లాలో వరికోతలు ముమ్మరంగా రాబోతు న్నాయి. కానీ ఇంతవరకు ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు ఆలోచనే లేదని జిల్లాలో ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు అందరూ కలిసి ఐఏబి సమావేశం ఏర్పాటు చేసి జిల్లాలో మూడు (3.50) లక్షల యాభై వేల ఎకరాల సాగుకు నీరు ఇవ్వగలమని హామీ ఇచ్చిన పిదప రైతులు, కౌలు రైతులు వ్యవ ప్రయాసలు ఓర్చి సాగు చేసి వరి ధాన్యం పండించినా, ఈరోజు సుమారుగా 10 లక్షల పుట్లు వరి ధాన్యం మార్కెట్లోకి రాబోతుండగా కొనుగోలు కేంద్రాల ఆలోచన లేదని చెప్పడం రైతును అదఃపాతాలానికి తొక్కడమని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం నెల్లూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ చర్య మిల్లర్లలకు మేలు చేసే విధంగా ఉన్నదే తప్ప రైతులకు ఉపయోగకరంగా లేదని. ఇదే కొనసాగితే జిల్లాలో కూడా రైతులు, కౌలు రైతుల ఆత్మహత్యలు చూడవలసి వస్తుందని, రైతు పక్షపాతిగా చెప్పుకుంటున్న ఈ ప్రభుత్వానికి ఇది మంచి పద్ధతి కాదని అందుకని వీలున్నంత త్వరలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతు పండించిన పంటకు మద్దతు ధర దక్కేలా చర్యలు తీసుకోనవలసినదిగా డిమాండ్ చేయడం జరిగింది. లేని పక్షములో రైతులను, కౌలు రైతులను సమీకరించి పెద్ద ఉద్యమం చేయగలమని ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం నెల్లూరు జిల్లా తెలియ చేసారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో డిఆర్ఓ హుస్సేన్ సాహెబ్‌కు వినతి పత్రం అందించారు.

## విశ్వంలో ఘనంగా తెలుగు బాషా దినోత్సవ వేడుకలు



**నెల్లూరు కలెక్టరేట్, ఆగష్టు 29, ప్రభాతవార్త :** తెలుగు బాషా దినోత్సవ వేడుకలను శుక్రవారం నగరంలోని స్థానిక అల్లిపురంలోని విశ్వం ఉన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధులుగా పాఠశాల చైర్మన్ హరి కోటేశ్వరరావు, కరస్పాండెంట్ బాలకృష్ణ లు పాల్గొని మాట్లాడారు. తెలుగు బాషా గొప్ప దనాన్ని వివరించారు. జై తెలుగు తల్లి అక్షర ఆకారంలో విద్యార్ధులు, పూలతో అలకంరించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో ఆర్టిస్ట్ అమీర్జాన్ తదితరులు పాల్గొన్నారు.

## విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక



**నెల్లూరు, ఆగష్టు 29, ప్రభాతవార్త- వైద్యం :** నెల్లూరు జిల్లా గ్రంధాలయ సంస్థ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక శుక్రవారం స్థానిక మహిళా గ్రంధాలయంలో ఏకగ్రీవంగా జరిగింది. గౌరవ అధ్యక్షునిగా ఏ.గోవిందరావు, సలహాదారుగా ఆర్.దశరథ రామిరెడ్డి, స్టేట్ రిప్రజెంటేటివ్‌గా ఐ.సుబ్బారెడ్డి అధ్యక్షునిగా వి.రంగారెడ్డి ఉపాధ్యక్షులుగా సుభాష్ చంద్ర గుప్త, ఏం.వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎన్.శ్రీనాథ్‌రెడ్డిలు ఎంపికయ్యారు. అలాగే సహాయ కార్యదర్శిగా డి.జయమ్మ, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వి.సుధాకరాచారి, కోశాధికారిగా ఈ.ఏడుకొండలు, సభ్యులుగా పి.ఆదిలక్ష్మి, ఎంఎన్ రాజు, ఎస్.పెంచలయ్య, కే.రవీంద్రనాథ్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. నెల్లూరు జిల్లా గ్రంధాలయ సంస్థ కార్యదర్శి కుమార్ రాజా, నూతనంగా ఎన్నికైన వారిని శాలువాతో సత్కరించి అభినందించారు.

## ఓ బొజ్జ గణపయ్య.. మా అండ నీవయ్య



**నెల్లూరు, ఆగష్టు 29, ప్రభాతవార్త -వైద్యం :** ఓ బొజ్జ గణపయ్యా.. మా అండ నీవయ్యా.. రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలతో వర్ధిల్లేలా చూడవయ్యా అంటూ రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆకాంక్షించారు. శుక్రవారం నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధి 16వ డివిజన్ ఆదిత్యనగర్‌లో ఏర్పాటు చేసిన గణేష్ మండ పాన్ని మంత్రి సందర్శించారు. వినాయకుని దర్శనానికి విచ్చేసిన మంత్రి నారాయణకు స్థానిక ప్రజలు, గణేష్ మండప నిర్వాహకులు ఘనంగా సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విఘ్నేశ్వరునికి మంత్రి నారాయణ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాధుని ఆశీర్వచనాలను అర్చక పండితులు మంత్రి నారాయణకు అందజేశాఉ. ఈ సందర్భంగా మంత్రి అక్కడ ఉన్న భక్తులందరిని ఆప్యాయంగా పలకరిస్తూ ముందుకు సాగారు. మంత్రి నారాయణతో ఫొటోలు దిగేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తూ ముందుకు వచ్చారు. ఎంతో భక్తిశ్రద్ధలతో మండపాన్ని ఏర్పాటు చేసి గణనాథునికి విశేష పూజలు నిర్వహిస్తున్న గణేష్ కమిటీ నిర్వాహకులను మంత్రి నారాయణ అభినందించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు సుబ్బారావు, టీడీపీ సీనియర్ నేత వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనురాధ, మాజీ జడ్పీటీసీ విజేతరెడ్డి, 16వ డివిజన్ కార్పొరేటర్ శ్రీకాంత్‌రెడ్డి, డివిజన్ ప్రెసిడెంట్ సాయి, టీడీపీ ముఖ్య నేతలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అట్టహాసంగా నూతన పాలకవర్గం ప్రమాణ స్వీకారం




**వింజమూరు, ఆగష్టు 29, ప్రభాతవార్త :** వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామంలో నీలగిరి పర్వతంపై వేంచేసి యున్న శ్రీ శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహాస్వామి, నూతన చైర్మన్, పాలక మండలి సభ్యుల ప్రమాణ స్వీకారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిధులుగా ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ తాజా మాజీ ఆలయ చైర్మన్ అల్లుడు, సినీ నటుడు గుత్తికొండ కార్తికేయ హాజరయ్యారు. మాజీ చైర్మన్ లెక్కల చిన్న కొండారెడ్డి నివాసం వద్ద అతిధులకు ఘన స్వాగతం పలికారు. చైర్మన్ నివాసం నుండి ముఖ్య అతిధులు పాలక మండల సభ్యులు ఆలయం వరకు లక్ష్మీ నరసింహస్వామి ఆలయం వరకు భాజ భజంత్రీలు, మేళ తాళాలు, బాణసంచాలతో ఊరేగింపుగా వెళ్లారు. ముందు క్షేత్ర పాలకుడు ఆంజనేయస్వామికి, ఆదినాయకుడు గణపతికి, బోలా శంకరుడు శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయం గర్భగుడి వెలుపల ప్రాంగణంలో ఆలయ ఈవో శాంతయ్య ఆలయ చైర్మన్‌గా లెక్కల కాంతారెడ్డి చేత ప్రమాణ స్వీకారం చేయించారు. అక్కడే పాలక మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విశిష్ట అతిదులు ఎమ్మెల్యే కాకర్ల సురేష్ మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి, లెక్కల చిన్న కొండారెడ్డి కుటుంబం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఈ ఆలయం అభివృద్ధి చెంది ఈ ప్రాంతానికి తలమానికం అవుతుందని చెప్పారు. అంతకముందు పని చేసిన చైర్మన్లు పాలక మండలి సభ్యులు ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని అభినందించారు. లక్ష్మీ నరసింహస్వామి ఆలయానికి నా సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తానని హామీ ఇచ్చారు. సినీ హీరో కార్తికేయ మాట్లాడుతూ మా అత్తగారైన లెక్కల కాంతరెడ్డి, ఆలయ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేయడం అందుకు నేను రావడం ఆనందంగా ఉందన్నారు. మామ ఎల్‌సీ కొండారెడ్డి ఆలయం గురించి ఎప్పుడూ చెప్తూ ఉంటారని, పెళ్లి సమయంలో వచ్చానని, ఇది రెండో పర్యాయం రావడం అని తెలిపారు. తిరుపతి శ్రీశైలం, అన్నవరం, తదితర ఆలయాల చేరువలో లక్ష్మీ నరసింహస్వామి వెలుగొందాలని ఆకాంక్షించారు. అంతకముందు లెక్కల చిన్న కొండారెడ్డి మాట్లాడుతూ పాలక మండలి సభ్యులలో ఎక్కువ మంది మహిళలు ఉండడం మహిళా చైర్మన్ ఉండడం విశేషం అన్నారు. ఆలయ అభివృద్ధికి శంక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలియజేశారు. అనంతరం వక్తలను, పాలక మండలి సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, పోలీసు హౌసింగ్ మాజీ చైర్మన్ మెట్టుకూరి చిరంజీవిరెడ్డి, మండల కన్వీనర్ గూడా నరసారెడ్డి, ఉదయగిరి బీజేపీ ఇన్‌ఛార్జీ కదిరి రంగారావు, పొలిటికల్ మేనేజర్ మాలేపాటి చైతన్య, ఎంపిటీసీ సభ్యులు సర్పంచ్ అన్నపురెడ్డి ప్రమీల, మాజీ చైర్మన్లు భోగిరెడ్డి నాగిరెడ్డి, అన్నపురెడ్డి శ్రీనివాసులురెడ్డి, లెక్కల మాలకొండారెడ్డి, అన్నపరెడ్డి మురళీధర్‌రెడ్డి, అన్నపరెడ్డి మోహన్‌రెడ్డి, రూపునేని వెంకటేశ్వర్లు నాయుడు, లెక్కల చిన్న కొండారెడ్డి, లెక్కల రాజశేఖర్‌రెడ్డి, బొల్లా వెంకట కృష్ణ, ఆకిలి రవి ప్రసాద్, అంకినపల్లి నరసింహులు, మీసాల నరసయ్య, భోగిరెడ్డి శార్వాణి, చంచల సుభాషిణి, పొన్నూరు అంకమ్మ, గ్రామ పెద్దలు నాయకులు, ఆయనకినపల్లి ఓబుల్‌రెడ్డి, అంకినపల్లి శివశంకర్‌రెడ్డి, ఎంపీపీ ఇనగనూరి మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులు ఆనంగి రమణయ్య, సొసైటీ చైర్మన్ చల్లా వెంకటేశ్వర్లు యాదవ్, జడ్పీటీసీ సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు వనిపెంట సుబ్బారెడ్డి, జూపల్లి రాజారావు, కటకం ప్రసన్న కుమార్, చల్లా శ్రీనివాసులు యాదవ్, కొండారెడ్డి, రూపు నేని రత్నం, గాలి రామ్మోహన్‌నాయుడు, గాలి నరసప నాయుడు, ఉదయగిరి మండల కన్వీనర్ సీహెచ్ బయన్న, పాములపాటి మాల్యాద్రి, మద్దూరి రాజగోపాల్‌రెడ్డి, పోలనేని చంద్రబాబునాయుడు ,ఆలయ ఈవో శాంతయ్య, మాజీ జడ్పీటీసీ సభ్యులు పులిచెర్ల వెంకట నారాయణరెడ్డి, అన్నపురెడ్డి తిరుపాలురెడ్డి, అన్నపురెడ్డి ధర్మారెడ్డి, బొల్లా సుబ్రహ్మణ్యం, బొమ్ము పెంచలరెడ్డి, బొమ్ము నరసింహారెడ్డి, వీరంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, రూపినేని అశోక్, భోగిరెడ్డి ఓబుల్‌రెడ్డి, లెక్కల మురళి తదితరులు ఉన్నారు.

## శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి ఆరాధన ఉత్సవాల్లో పాల్గొన్న వేమిరెడ్డి బ్రదర్స్



**నెల్లూరు, ఆగష్టు 29, ప్రభాతవార్త :** శ్రీ భగవాన్ వెంకయ్య స్వామి 35 వఆరాధన సందర్భాన్ని పురస్కరించుకొని బాద్రపద శుద్ధ షష్టి తిథి శుక్రవారం నెల్లూరు నగరంలోని కిసాన్ నగర్ సింహపురి కాలనీ ప్రాంతంలో పేదలకు అన్నదాన కార్యక్రమం జరిగింది. స్వామివారి పాద రేణువు మణి ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నారాయణ విద్యాసంస్థల జీఎం వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్లపాక అనురాధ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించి మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా ప్రత్యేకంగా పూజలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ ముఖ్య నాయకులు లెక్కల వెంకట్ రెడ్డి డివిజన్ అధ్యక్షురాలు కోమరి విజయమ్మ వేణుగోపాల్, టిడిపి నేతలు ముడియాల నారాయణరెడ్డి, అర్చక స్వాములు శీను గొట్టిపాటి కృష్ణ, పార్టీ ముఖ్య నేతలు పాల్గొన్నారు..

## పెన్నా బ్యారేజి వద్ద నిమజ్జనం జరిగే ప్రాంతాన్ని సందర్శించిన డిఎస్‌పి వేణుగోపాల్



**సంగం ఆగష్టు 29 ప్రభాతవార్త :** సంగంలోని పెన్నా బ్యారేజి వద్ద నిమజ్జనం జరిగే ప్రాంతాన్ని డిఎస్‌పి వేణుగోపాల్,సిఐ వేమారెడ్డి, ఎస్ఐ రాజేష్ సందర్శించారు. నిమజ్జనం ప్రాంతం వద్ద తీసుకోవాల్సిన జాగ్రత్త లపై ఆత్మ కూరు డిఎస్‌పి,సిఐ, ఎస్ఐకిపలు సూచనలు చేశారు. నిమజ్జనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా బ్యారేజి వద్ద అన్ని వసతులు ఏర్పాట్లు చేయాలని సూచించారు. నిర్వాహకులు వినాయకుని నిమజ్జనాలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని అన్నారు. ప్రజలు,నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని అన్నారు. ఆత్మకూరు సబ్ డివిజన్ పరిధిలో శుక్రవారం 375 విగ్రహాలు నిమజ్జనం చేయనున్నట్లు తెలిపారు. నిమజ్జనం వద్ద ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పలు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

## వినాయకుని పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే



**దగదర్తి, ఆగష్టు 29, ప్రభాతవార్త :** వినాయక చవితి సందర్భంగా ఉలవపాళ్ళ గ్రామంలోని వినాయకుని గుడి సెంటర్ వద్ద పోలిశెట్టి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఏర్పరిచిన గణపతి మండపానికి కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి వినాయకుని మూడో రోజు పూజ కార్యక్రమంలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. స్వామివారి ఆశీస్సులు అందరికి ఉండాలని కోరుకున్నారు. అలా దగదర్తి మండలంలోని కొన్ని గ్రామాలను సందర్శించారు. ఆయనతో పాటు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి, మండల అధ్యక్షులు అల్లం హనుమంతరావు, మండల ఉపాధ్యక్షులు వింజం కొండపనాయుడు, దగదర్తి మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.

## బీజేపీ నేతలపై బనాయించిన అక్రమ కేసులను కొట్టేసిన కోర్టు



**నెల్లూరు అగ్రికల్చర్, ఆగష్టు 29, ప్రభాతవార్త :** వైసీపీ ప్రభుత్వంలో గతంలో అప్రజాస్వామిక విధానాలపై ప్రజల తరుపున పోరాడి ఆందోళన చేసిన సందర్భాలలో బీజేపీ నాయకులపై బనాయించిన అక్రమ కేసుల నుండి ఆ పార్టీ నేతలకు విముక్తి లభించింది. కేసులను సమగ్రంగా విచారించిన సెకండ్ ఏడీ ఎం జడ్జి ఎల్.శారదారెడ్డి ఆ కేసులను కొట్టి వేయడం జరిగింది. బీజేపీ తరుపున న్యాయవాది బీఎస్ రంగరాజన్, దాసరి రాజేంద్రప్రసాద్, పార్టీ కేసులను వాదించారు. చిన్న బజార్ పోలీసు స్టేషన్ పరిధిలో నమోదైన ఈ కేసులు నుండి బీజేపీ నాయకులు విముక్తి పొందారు. దీనిపై ఆ పార్టీ నేతలు అంతా హర్షం వ్యక్తం చేశారు.

## వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులను అడ్డుకున్న పోలీసులు



**కావలి ఆగష్టు 29, ప్రభాత వార్త:** కావలి పట్టణంలోని కావలి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి నివాసానికి వెళుతున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలను శుక్రవారం పోలీసులు ఎక్కడికి అక్కడ అడ్డుకుంటూ అదుపులోకి తీసుకోవడం జరిగింది మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి నివాసం, ఆర్ఎస్ఆర్ కళ్యాణ మండపం, ముసునూరు మద్దూరు పాడు వద్ద కావలిని కలిపే లింకు రోడ్డు వద్ద, ముసునూరు టోల్ ప్లాజా వద్ద కావలి రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జి రాజేశ్వరరావు, కావలి రూరల్ ఇనస్పెక్టర్ పాపారావు ల ఆధ్వర్యంలో ఎస్సైలు సుమన్ తిరుమల్ రెడ్డి బాజీ బాబు మరి కొంతమంది ఎస్సైలు వారి సిబ్బందితో మోహరించడం జరిగింది. ఈ విధానాన్ని వైసీపీ నాయకులు కార్యకర్తలు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు నెల్లూరు నుండి మాజీ మంత్రులు కాకాని గోవర్ధన్ రెడ్డి,కారుమూరి వెంకట నాగేశ్వరరావు,ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి నెల్లూరు రూరల్ ఇంచార్జ్ ఆనం జయకుమార్ రెడ్డి, సూళ్లూరుపేట మాజీ శాసనసభ్యులు కిలువేటి సంజీవయ్య తదితర వైసిపి నాయకులు కావలి లోని మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి నివాసానికి వస్తున్నట్లు సమాచారం రావడంతో ముందస్తుగా వారిని గృహ నిర్బంధంలో ఉంచడం జరిగింది. వీరందరూ కావలికి వస్తే అడ్డుకుంటామని తెలుగుదేశం పార్టీ నాయకుల హెచ్చరికలతో ముందస్తు చర్యల్లో భాగంగా వైసిపి నాయకులను కార్యకర్తలను పోలీసులు అడ్డుకుంటూఎక్కడ చర్యలు చేపట్టడం జరిగింది.

**కారుమూరిని అడ్డుకున్న పోలీసులు:** కావలి మాజీ సభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వెళుతున్న మాజీ మంత్ర వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు జిల్లా రీజినల్ కోఆర్డినేటర్ కారుమూరి వెంకట నాగేశ్వరరావు ను కావలి జాతీయ రహదారిపై పోలీసుల అడ్డుకొని నెల్లూరుకు వెళ్లేందుకు అనుమతులు లేవని తిరిగి పంపడం జరిగింది

## అనధికార లేఅవుట్లలో ప్లాట్లను క్రమబద్ధీకరించుకోండి...



**నెల్లూరు కార్పొరేషన్, ఆగష్టు 29,ప్రభాతవార్త:** అనధికార లే-అవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ప్రభుత్వం గొప్ప అవకాశం కల్పించిందని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట క్రిష్ణారెడ్డి తెలిపారు. నెల్లూరులోని నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం రాష్ట్ర మంత్రి పొంగూరు నారాయణ, పలువురు ఎమ్మెల్యేల సమక్షంలో విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్) అమల్లోకి వచ్చిందని, అనధికార లే-అవుట్ల లో ప్లాట్లు కలిగిన వారు మార్కెట్ విలువలో 7 శాతం చెల్లించి వాటిని క్రమబద్ధీకరించుకోవాలన్నారు. ఇలా చేస్తే భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు లేకుండా బ్యాంకు రుణాలు పొందే వీలుంటుందని, భవన అనుమతులు కూడా సులభంగా లభిస్తాయని తెలిపారు. తెలిసి, తెలియక అనధికార ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి ఈ పథకం ఎంతో మేలు చేస్తుందని చెప్పారు. నెల్లూరు జిల్లాలో వివిధ మండలాల్లో పెద్ద ఎత్తున లే-అవుట్లు ఏర్పడ్డాయని, వీటిని రెగ్యులర్ చేసుకుంటే ప్లాట్ యజమానులు న్యాయబద్ధంగా లాభాలు పొందగలరని తెలిపారు. ప్రస్తుతం కావలి నియోజకవర్గంలోనే దాదాపు 825 ఎకరాల వరకు అనధికార లే-అవుట్లు ఉన్నాయని, వీటిని క్రమబద్ధీకరిస్తే ప్రతి పేదవాడికి ధైర్యం కలుగుతుందని, అవసరమైతే ఆస్తిని అమ్ముకునే అవకాశం కూడా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఇంటి నిర్మాణ సమయంలో చెల్లించాల్సిన 14 శాతం కంటే ఇప్పుడు కేవలం 7 శాతం మాత్రమే చెల్లిస్తే ప్లాట్ రెగ్యులరైజ్ అవుతుందని, ఈ అవకాశా న్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మంత్రి నారాయణ నాయకత్వంలో జిల్లాలో లేఅవుట్లన్నీ రెగ్యులర్ అయ్యేలా చర్యలు జరుగుతున్నాయని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలందరికీ అభివృద్ధి అవకాశాలు కల్పించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## సోమశిల నీటిమట్టం

**అనంతసాగరం, ఆగష్టు29ప్రభాతవార్త:** మండలంలోని సోమశిల జలాశయానికి ఎగువ ప్రాంతాల నుంచి శుక్రవారం సాయంత్రానికి 19496క్యూసెక్కుల వంతునవరద ప్రవాహం నమోదైంది. జలాశయం పూర్తిసామర్థ్యం 78 టిఎంసిలు కాగా ప్రస్తుతం జలాశయం లో60.050టిఎంసిల నీరు నిల్వ ఉంది. ఎస్ఎఫ్‌సికి 250,ఎన్ఎఫ్‌సికి 400, పెన్నా డెల్టాకు1000, కండలేరు వరద కాలువకు 0 క్యూసెక్కులు వంతున నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం 98.020మీటర్ల మేర నీటిమట్టం నమోదైందని జలాశయం అధికారులు తెలిపారు.

## పీఏఐ 2.0 పై ఒక రోజు శిక్షణా కార్యక్రమం



**వింజమూరు, ఆగష్టు 29, ప్రభాతవార్త :** వింజమూరులోని మండల పరిషత్ కార్యాలయంలో పీఏఐ 2.0పై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీడీఓ సీతారామాంజనేయులు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక అంశంపై పంచాయతీ కార్యదర్శులు పంచాయతీ అభివృద్ధికి ఏ విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి ఏ విధంగా ఆ ప్రణాళికను అమలు పరచాలి అనే విషయాలను తెలియజేశారు. అలాగే పంచాయతీకి ఏ విధంగా ఆదాయం మార్గాలను సిద్ధం చేసుకోవాలో తెలిపారు. పంచాయతీకి ఆదాయం లేనట్లయితే అభివృద్ధి చేయడం కష్టంగా ఉంటుందని ఆయన తెలిపారు. పంచాయతీలకు వచ్చే నిధులను ఏఏ పనులకు ఎంతెంత వాడాలో ప్రణాళిక బద్ధంగా నిర్ణయించుకోవాలన్నారు. పనులను ఎంచుకుని అందుకు తగిన విధంగా నిధులను ఖర్చు చేయాలన్నారు. సభ్యుల సహకారంతో పంచాయతీకి నిధులను సమకూర్చుకుంటూ ప్రజలకు అవసరమైన సౌకర్యాలను కల్పిస్తూ ముందుకు సాగాల్సిన అవసరం ఉందన్నారు. పంచాయతీ అభివృద్ధికి అందరి సహకారం తీసుకోవాలని సమిష్టి కృషితోనే ఇది సాధ్యం అవుతుందన్నారు. అన్ని పంచాయతీల కార్యదర్శులు జడ్పీటీసీ సభ్యులు గణపం బాలకృష్ణారెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఆనంగి రమణయ్య, సర్పంచ్‌లు ఎన్.సుజనాచాట్ల, రమణారెడ్డి, మాజీ ఎంపీటీసీ రొడ్డ కొండయ్య, కొడవల్లి రమేష్, దూసాని రమణయ్య, విశ్రాంత ఎంపీడీఓ నజీర్, లక్ష్మీ దేవమ్మ, కార్యాలయ సిబ్బంది, ఎంపీటీసీ సభ్యులు తదితరులు ఉన్నారు.

## వసతి గృహ సంక్షేమ అధికారికి పదోన్నతి



**వింజమూరు, ఆగష్టు 29, ప్రభాతవార్త :** వింజమూరులోని బీసీ బాలుర వసతి గృహ సంక్షేమ అధికారి రవికుమార్ ఏబీసీడ బ్ల్యూఓగా పదోన్నతి పొంది ప్రకాశం జిల్లా కనిగిరికి వెళ్తున్నట్లు ఆయన తెలిపారు. వింజమూరులో బీసీ బాలుర వసతి గృహ సంక్షేమ అధికారిగా అతి తక్కువ కాలం విధులు నిర్వహించి నప్పటికి ఇక్కడ పని చేసిన అనుభూతి ఎంతోగొప్పది అన్నారు. పదోన్నతిపై వెళ్తున్న రవికుమార్‌కు చాకలికొండ వసతి గృహసంక్షేమ అధికారి పి. వెంగళరావు,బీసీ వసతి గృహ సిబ్బంది బదిలీ వీడ్కోలు పాలికారు.

## విఘ్నేశ్వరసేవలో ప్రముఖులు



**వరికుంటపాడు, ఆగష్టు29, ప్రభాతవార్త:** మండలంలో గతమూడు రోజులుగ జరుగుతున్న వినాయకచవితి ఉత్సవాలు అత్యంతవైభవంగ జరిగాయి .మండల ంలోని జడదేవి గ్రామంలో వరికుంట పాడుసొసైటి అధ్యక్షు డు గుర్రం గోపి దంపతులు స్థానిక గణేష్ మండపంవద్ద ప్రత్యేకపూజలు నిర్వహించారు. కనియం పాడు గ్రామంలో టిడిపి మండల ప్రధానకార్యదర్శి పోలుబోయిన శ్రీకాంత్‌యాదవ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు అందజేశారు.మండలంలోని గువ్వాడి, కాంచెరువు, బోయమడుగు, దక్కునా ఊరు,పెద్దిరెడ్డిపల్లి, పామూరుపల్లి ,తోటతచెరువుపల్లి ,తొడుగుపల్లి,విరువూరు మారుతీనగర్, పావన్నగారిపల్లి ,గొల్లపల్లి,గొల్లపల్లిసంఘం,ఎర్రంరెడ్డి పల్లి,టి కొండారెడ్డిపల్లి,జి కొండారెడ్డిపల్లి,నార్త్‌కొండాయపాళెం ,ధర్మవరం ,వరికుంటపాడు, అండ్రవారిపల్లి ,రామాపురం తదితర గ్రామాలలో వినాయక ఉత్సవాలు అత్యంత వైభవంగ జరిగాయి.ఇతర రాష్ట్రాలలో స్థిరపడిన యువకులు తరలివచ్చి పోటాపోటీగ విగ్రహాలు ఏర్పాటుచే యడంతో పాటు అన్నదాన కార్యక్రమా లను నిర్వహించారు.అలాగే మూడవరోజు ఉట్టికొట్టడంతో పాటు లడ్డువేల ంపాటలు జరిగాయి .పావన్నగారిపల్లి గ్రామంలో జరిగిన ఉత్సవాలలో అంబటి రాజేష్ 11వేల రూపాయలకు లడ్డును దక్కించుకున్నారు.గొల్లపల్లి ఎస్‌టి కాలనీలో జరిగిన ఉత్సవాలకు పోస్టల్ ఉద్యోగి నూకసాని వెంకట్రావు విగ్రహాన్ని అందజేశారు.ఈవిదంగ మండలంలో వైభవంగ ఉత్సవాలు నిర్వహించారు.

## నిమర్జనానికి బయలుదేరిన గణనాధులు



**కావలి, ఆగస్ట్ 29, ప్రభాతవార్త :**వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మూడవ రోజు శుక్రవారం పరిసర ప్రాంతాల్లోని గణనా థులు నిమర్జనానికి భారీగా తరలి వెళ్లడం జరిగింది నిమర్జనం సందర్భంగా భారీ బాణాసంచా కాలు స్తూ డిజే సౌండ్ శబ్దాలతో డబ్బులు వాయిద్యాలతో మేళతాళాలతో తదితర సాంస్కృతిక ప్రదర్శనలతో కోలాహ లంగా గణేష్ మహారాజ్ కి జై అంటూ నినాదాలు చేస్తూ గణనాధులను నిమర్జనానికి తరలించడం జరిగింది గణనాధులను అధికంగా కావలి రూరల్ మండలంలోని తుమ్మలపెంట, చెన్నాయి పాలెం, కొత్త సత్రం సముద్ర తీరాలలోని బీచ్ లకు నిమర్జనానికి తీసుకు వెళ్లడం జరిగింది కావలి రూరల్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జి రాజేశ్వరరావు తన సిబ్బందితో ఆయా బీచ్ ల వద్ద భక్తులకు,ప్రజలకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగింది

### ప్రాథమిక స్థాయి విద్యాబోధన తెలుగు మాధ్యమంలో మాత్రమే ఉండేలా ఆదేశాలు ఇవ్వాలి



**కావలి, ఆగష్టు 29, ప్రభాతవార్త:** ప్రాథమిక స్థాయి విద్యాబోధన తెలుగు మాధ్యమంలో మాత్రమే ఉండేలా ప్రభుత్వం విద్యావిధానాన్ని రూపొందిస్తూ ఆదేశాలు ఇవ్వాలనీ గిడుగు రామ్మూర్తి జయంతిని పురస్కరి ంచుకొని తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా కలయిక విజ్ఞానకేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం కావలి ఆర్డీఓ సన్నీ వంశీకృష్ణకు వినతిపత్రం అందించడం జరిగింది ఈ సందర్భంగా కావలి కలయిక విజ్ఞాన కేంద్రం సలహాదారు చాకలకొండ శారద మాట్లాడారు తెలుగు మాతృభాష అయిన ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో కూడా ప్రాథమిక విద్యాబోధన ప్రభుత్వ ,ప్రైవేట్ పాఠశాలల్లో కూడా ఆంగ్లంలో జరగడం తెలుగుభాషను అవమానించడమే నన్నారు త్రిభాషాసూత్రం ప్రకారం తెలుగు ,హిందీ , ఆంగ్లం మూడు భాషలను నేర్పించవచ్చు అన్నారు కానీ గణితం , సామాజిక ,విజ్ఞానశాస్త్రాలు కూడా ఆంగ్లంలో బోధించడం జరగడం శోచనీయమని తెలియజేశారు గణితం , సాంఘికశాస్త్రాలు ,విజ్ఞానశాస్త్రాల బోధన అభ్యసన యాంత్రికంగా సాగుతున్న ఈ విద్యావిధానం ద్వారా విద్యార్థుల నైపుణ్యాలు వినడం , మాట్లాడటం , చదవడం స్వంతంగా వ్రాయడం దెబ్బతింటున్నాయన్నారు అందుకేవ్యావహారిక భాషా పితామహుడు గిడుగురామమూర్తినీ గౌరవిస్తూ తెలుగుభాషాదినోత్సవం సందర్భంగా తెలుగు భాష మాతృభాషగా ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రాథమిక విద్యాబోధన తెలుగు భాషలో మాత్రమే ఉండేలా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తక్షణమే తెలుగు భాషలోనే ప్రాథమిక స్థాయి ప్రభుత్వ ,ప్రైవేట్ పాఠశాలల్లో విద్యాబోధన చేపట్టాలని తక్షణమే విధానపర నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు జారీ చేయాలని ముఖ్యమంత్రి కి తమ ప్రతిపాదనలు పంపించాలని కోరడం జరిగిందన్నారు ఆర్టీవోని కలిసిన వారుచన్నా వెంకట్రామయ్య ,జి.రాంప్రసాద్ ,ఎమ్‌వి.ప్రసాదరావు ,బి.హరినారపరెడ్డి ,ఫాతిమా ,బుష్రా , రమేష్,కె.గోపీకృష్ణ ,నక్కా .సాయిరాం ప్రసాద్ తదితరులు ఉన్నారు

## ఘనంగా జరిగిన జాతీయ క్రీడా దినోత్సవం



**నెల్లూరు, ఆగష్టు 29, ప్రభతవార్త వైద్యం** నారాయణ వైద్య విద్యా సంస్థల ప్రాంగణంలో నారాయణ మెడికల్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎస్ఎస్ విభాగం ఫ్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కార్తీక్ మాట్లాడుతూ యూనివర్సిటీ ఆఫ్ గ్రాంట్స్ వారు ప్రతి విద్యార్థి వారికి నచ్చిన ఏదో ఒక క్రీడలో రోజులో కనీసం ఒక గంటపాటు పాల్గొనాలనే ఆదేశానుసారం ఈ కార్యక్రమాన్ని నారాయణ వైద్య విద్యాసంస్థల డీన్ డాక్టర్‌పి.శ్రీనివాసులురెడ్డి సహకారంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. అందులో భాగంగా ఈ రోజు నిర్వహిస్తున్న ఈ వాలీబాల్ టోర్నమెంట్‌కు మహాత్మా వాలీబాల టోర్నమెంట్ పేరుతో ప్రారంభించడం జరిగిందని, ఈ టోర్నమెంట్‌లో బాలురు నాలుగు జట్లుగా బాలికలు రెండు జట్లుగా పాల్గొంటున్నారని వారివారి టీమ్‌లకు ఫ్రీడం ఫైటర్స్ పేరు పెట్టుకోవడం జరిగిందని తెలిపారు. ప్రతి సంవత్సరం క్రీడలతో పాటుగా అనేక అవగాహన కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నామని, అన్ని కార్యక్రమాలు విజయవంతం అయ్యేందుకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా నారాయణ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వనజకుమారి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలు కూడా చాలా ముఖ్యమన్నారు. అనంతరం నారాయణ ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ విభాగాధిపతి ఎన్ఎస్ఎస్ కమిటీ మెంబర్ డాక్టర్ యశోవర్ధన్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఆగష్టు 29వ తేదీని మేజర్ ధ్యాన్‌చంద్ పుట్టిన రోజుని స్పోర్ట్స్ డే గా జరుపుకుంటారని, ప్రతి రోజు ఆటలు ఆడటం వలన ఫిజికల్ మెంటల్‌గా దృఢంగా ఉంటారని, విద్యార్థులు మానసికంగా దృఢంగా ఉండేందుకు క్రీడలు ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణ వైద్య విద్యాసంస్థల ఫిజికల్ డైరెక్టర్ సెల్విబాబు, వైద్య విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రాథమిక స్థాయి నుంచి క్రీడల పట్ల దృష్టి సారించాలి



**కోవూరు , ఆగష్టు 29 ప్రభాతవార్త :** ప్రాథమిక స్థాయి నుంచి ప్రతి విద్యార్థి క్రీడల పట్ల మక్కువ చూపితే వారిలో దాగి ఉన్న అనేక నైపుణ్యాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయిని పర్వీన్ తెలిపారు. కోవూరులోని పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా ఆ మహనీయుని చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. అదే విధంగా తెలుగుభాష దినోత్స వాన్ని పురస్కరించుకుని గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి కూడా పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ఝాన్సీరాణి సుమారు 20 వేలు విలువ చేసే స్పోర్ట్స్ మెటీరియల్‌ను పాఠశాల ఫిజికల్ డైరెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల పట్ల ఉన్న ప్రత్యేకమైన మమకారంతో ఝాన్సీరాణి ఈ స్పోర్ట్స్ మెటీరియల్ అందజేయడం ఇతరులకు స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు పి. సులోచన, సునీత, స్వాతి, పీఈటీ వెంకటసుబ్బమ్మ, గీతామాధురి, తదితరులు ఉన్నారు.

## ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



**పాటూరు ( కోవూరు ,) ఆగష్టు 29 ప్రభాతవార్త :** వ్యవసాయం సాగు చేసే రైతు ఈ పంట నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని కోవూరు సహాయ వ్యవసాయ సంచాలకులు అనిత అన్నారు. ఆత్మ సారథ్యంలో కోవూరు మండలం పాటూరు లోని రైతు సేవా కేంద్రంలో రైతులకు పలు విషయాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు అన్నదాత సుకీభవ పీఎం కిసాన్ నిధులు పడని రైతులు వెంటనే వారి వారి పరిధిలో ఉన్న గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి తమ సమస్యను గుర్తించి పరిష్కరించుకోవాలన్నారు. రైతులు యూరియాను ఎకరాకు 3 బస్తాలు మాత్రమే వాడాలని, ఎక్కువగా వాడడం వలన సాగు ఖర్చులు పెరగడమే కాకుండా తెగుళ్లు కూడా ఎక్కువగా సోకే అవకాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మోతాదులోనే ఎరువులు, పురుగుమందులు వాడుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి రజని, గ్రామ వ్యవసాయ సహాయకులు ప్రభ, ఏసీవో ఆసియా, రైతులు ఉన్నారు.

## తొలగించిన పించన్లను తిరిగి కొనసాగించాలి



**ఆత్మకూరు , ఆగస్టు29,ప్రభాతవార్త :** ఆత్మకూరు నియోజకవర్గ పరిధిలో వివిధ కారణాలతో తొలగించిన పెన్షన్లను యధావిధిగా కొనసాగించాలని ఆత్మకూరు ఆర్‌డిఒ ఆఫీస్‌లో ఎఒకు వినపత్రం అందజేశారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా సహాయ కార్యదర్శి యామాల మధమాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంధ కారణాలతో పెన్షన్లు తొలగించారు. వికలాంగుల పెన్షన్లకు సంబంధించి పాక్షికంగా వికలాంగులు ఉన్నారనే సాకు చూపుతూ వారికి అర్హత లేదని చెప్పి పెన్షన్ తొలగించారన్నారు. ఇది చాలా దారుణమైన చర్య పెన్షన్లపై నే ఆధారపడి జీవిస్తున్న వికలాంగులు ఇతరులు పెన్షన్ ఆగిపోవడంతో వారిని పట్టించుకునే వారు లేక దిక్కుతోచని స్థితి లో ఉండిపోయారన్నారు. వెరిఫికేషన్ పేరుతో కూటమి ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా వేలాది పెన్షన్లు తీసివేస్తుందని ఇది సరైన చర్యకాదన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం సంబంధిత అధికారులు స్పందించి తొలగించిన పెన్షన్లు మరోసారి విచారణ జరిపి నిజమూన అర్హులకు పెన్షన్లు అందజేయాలని లేనిపక్షంలో భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో మరో ఉద్యమానికి పిలుపునిస్తామన్నారు. ఈకార్యక్రమంలో సిపిఐ టౌన్ కార్యదర్శి జంగం నాగరాజు, జిల్లా సమితి సభ్యులు ఇండ్ల అంకమ్మ, మున్సిపల్ నాయకులు బి.హజరత్, ఎం.కొండయ్య, రమణయ్య, మాలకొండయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

### 4దశాబ్దాలుగా తమ అనుభవంలో ఉన్న పొలాన్ని ఆక్రమించేకు యత్నం



**ఆత్మకూరు,ఆగస్టు29,ప్రభాతవార్త :** ఏఎస్‌పేట మండలంలోని మదారాబాద్‌కు చెందిన చీమల చిన్నమాలకొండయ్య తమ సొంత పొలాన్ని కొందరు వ్యక్తులు నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి తమ పొలాన్ని ఆక్రమించేందుకు దౌర్జన్యం చేస్తున్నారని ఆవేదనతో తెలిపారు. శుక్రవారం ఆత్మకూరులో విలేకర్లతో మాలకొండయ్య మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన జడ అయ్యన్న అనే వ్యక్తినుండి 40ఏళ్ళక్రితం గ్రామంలో సాగులో ఉన్న 5.6ఎకరాల పొలాన్ని కొనుగోలు చేసి అప్పటి నుండి పలు రకాల పంటలను వేసుకొని పంటలు సాగుచేసుకుంటూ తమ కుటుంబ పోషణ చేసుకుంటూ జీవిస్తున్నామని కానీ ఇటీవల కొందరు తమ గ్రామానికి సంబంధం లేని వ్యక్తులు తమ పొలాన్ని వారి పేరిట నమోదు చేసుకొని ఇది తమ పొలం అని తమను పొలం నుండి వెళ్ళిపొమ్మంటూ తనపై దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. 40ఏళ్ళు సాగుచేసుకుంటూ దానిపై ఆధారపడి జీవిస్తున్న తమ వృద్ధ దంపతులకు ఈపొలం జీవనాధారంగా ఉందని ఈ పొలం విషయంలో తమ గ్రామంలో విచారించి పొలం ఎవరి అనుభవంలో ఉందో పొలం ఎవరిదో కనుక్కొని తనకు తగు న్యాయం చేయాలని చిన్నమాలకొండయ్య ఆవేదన వ్యక్తం చేశాడు.

## సమన్వయంతో అభివృద్ధి పథంలోకి పంచాయతీలు



**కోవూరు , ఆగస్టు 29 ప్రభాతవార్త :** కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం పంచాయతీ అభివృద్ధి ప్రగతి సూచికలపై సర్పంచ్ లకు ఎంపీటీసీ సభ్యులకు వివిధ శాఖల అధికారులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఎంపీడీవో శ్రీహరిరెడ్డి మాట్లాడు తూ అన్ని శాఖల అధికారులు సమన్వయం చేసుకుని పంచాయతీలను అభివృద్ధి పథంలో పయనిం పజేసేందుకు ముందుకు సాగాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయతీల అభివృద్ధికి పలు సూచికలను ఏర్పాటు చేసిందన్నారు. వాటిని అనుసరించి గ్రామ పంచాయతీలు రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి పథంలో పయనించాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు పార్వతి, ఉపాధ్యక్షుడు నరసింహులు రెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు వీడియో ద్వారా పంచాయతీ ప్రగతికి సంబంధించిన సూచికలపై సభకు అవగాహన కల్పించారు.

## తెలుగును పాలనా భాషగా పటిష్టంగా అమలు చేయాలి



**బిట్రగుంట ఆగష్టు 29 ప్రభాతవార్త:**తెలుగు భాషను పాలనాభాషగా పటిష్టంగా అమలు చేయాలని లోక్ సత్తా ఉద్యమ సంస్థ సమన్వయ కమిటీ సభ్యులు ఎం.మాలకొండ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పాలన కార్యక్రమాలన్నీ తెలుగులోనే నిర్వహించాలన్నారు. ప్రాథమిక విద్యను మాతృభాషలో కనీసం 30 అభ్యసించుకుంటే అది మృత భాషగా మారుతుందని యునెస్కో హెచ్చరించిందన్నారు. జిల్లాలో అధికార భాషా కళా కమిటీలను ఏర్పాటు చేసివ అమలు తీరుతెన్నుల పై పరిశీలించాలని కోరారు.తెలుగు రచయితలు, కవులు కళాకారులు, మేధావులు నిరంతరం తెలుగు భాషకు వన్నె తెచ్చే విధంగా కృషి చేయాలన్నారు. వ్యవహారిక భాష పితామ హుడు గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతి ని స్ఫూర్తిగా తీసుకొని తెలుగు భాష పరిరక్షణకు రాష్ట్ర తెలుగు అధికార భాషా సంఘం మరియు రాష్ట్ర ప్రభుత్వం తెలుగును పాలనా భాషగా పటిష్టం గా అమలు చేయాలని కోరారు.

## డిగ్రీ కళాశాలలో ఘనంగా తెలుగు భాషా దినోత్సవం



**కోవూరు , ఆగష్టు 29 ప్రభాతవార్త :**కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ పరిధిలోని నేతాజీనగర్‌లో ఉన్న వైకేఆర్అండ్‌కే ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం తెలుగు భాషా దినోత్సవాన్ని తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీపీ లక్ష్మీప్రసూన మాట్లాడుతూ తెలుగు భాష తియ్యదనాన్ని , తెలుగువారికి ఉండాల్సిన భాషాభిమానాన్ని తెలియజేస్తూ వ్యవహారిక భాష ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి చేసిన సేవలు నిరుపమానం అన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామ్‌ప్రసాద్, కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ చుక్కా శ్యామల కుమార్, కళాశాల సీనియర్ అధ్యాపకులు ఎం. మధుసూదన్‌రావు, డాక్టర్ ఎస్. రామాంజనేయులు, డాక్టర్ కె. శోభారాణి, డాక్టర్ విజయలు పలు సూచనలు చేశారు. అంతకుముందు గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారు.

## పొదుపు గ్రూపులు సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలి



**కోవూరు , ఆగస్టు 29 ప్రభాతవార్త :** కోవూరులోని సంఘమిత్ర కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ఈసీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం సుబ్బరాజు మాట్లాడుతూ ప్రతి పొదుపు గ్రూపులో ఉన్న సభ్యులంతా పూర్తిగా అక్షరాస్యులు కావాలన్నారు. త్వరలో దీనికి సంబంధించి వయోజనులకు ప్రత్యేక క్లాసులు కూడా నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా క్రమం తప్పకుండా పొదుపు గ్రూపులు సమావేశాలు ఏర్పాటు చేసుకుని రికార్డు రిజిస్టర్ల నిర్వహణ పారదర్శకంగా ఉండాలన్నారు. అదేవిధంగా వీవోఏలు పొదుపు గ్రూపుల్లో అవగాహన కల్పించి లోకోస్ యాప్‌ను నూరుశాతం పూర్తిచేసేలా తగు చొరవ తీసుకోవాలన్నారు. అదేవిధంగా మహిళా రైతులు స్వయం సమృద్ధి సాధించి మహిళావేత్తలుగా మారాలన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో సంఘమిత్ర అధ్యక్షురాలు లాస్య పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో సీసీలు మురళి, రాజశేఖర్, రాము, శోభ, తదితరులు ఉన్నారు.

## క్రీడల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలి



**కోవూరు, ఆగస్టు 29 ప్రభాతవార్త :** ప్రతి విద్యార్థి క్రీడల పట్ల దృష్టి సారించాలని కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి. సుబ్బారావు అన్నారు. కోవూరు మండలం గంగవరం గ్రామంలో గీతాంజలి ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేజర్ ధ్యాన్ చంద్ హాకీ క్రీడకు ఎనలేని సేవలు చేశారన్నారు. తన హామీ క్రీడా కౌశల్యంతో అంతర్జాతీయ స్థాయిలో దేశ గౌరవ ప్రతిష్టలను ఇనుమడింపజేశారన్నారు. క్రీడల వలన అంతర్జాతీయ సంబంధాలు మరింత బలపడతాయన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రవణ్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ క్రీడలు హదారుద్యాన్ని పెంచడమే కాకుండా మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయన్నారు. అడ్మిషన్ డీన్ డాక్టర్ వీఎల్ఎన్ కుమార్ మాట్లాడుతూ తమ కళాశాలలో సాంకేతిక విద్యాబోధనతో పాటు క్రీడల పట్ల కూడా సమప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. అంతకుముందు ధ్యాన్‌చంద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డీన్లు డాక్టర్ టి. రవికుమార్, డాక్టర్ పి. బాబు, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ పి. అశోక్‌కుమార్, అసిస్టెంట్ పీడీ అనిల్‌కుమార్, విద్యార్థులు ఉన్నారు.

## వైభవంగా అన్నదానం



**కోవూరు , ఆగస్టు 29 ప్రభాత వార్త :** కోవూరులోని టీఎన్‌సీ కళాశాల ప్రాంతంలో టీఎన్‌సీ కళాశాల యూత్ ఆధ్వ ర్యంలో శుక్రవారం భారీస్థా యిలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ యూత్ సభ్యులు గత 25 సంవత్స రాలుగా ఈ ప్రాంతంలో వినాయక విగ్రహం ఏర్పాటు చేసి ఇటువంటి సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతూనే ఉన్నారు. ఈ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విగ్రహం ప్రతి ఒక్కరినీ అలరింపజేసింది. ఈ కార్యక్రమంలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఆకట్టుకున్ననృత్యాలు



**కోవూరు , ఆగస్టు 29 ప్రభాతవార్త :** కోవూరులోని పాఠశాల ప్రాంగణంలో శుక్రవారం ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా కీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రదర్శించిన పలు క్రీడా నృత్యాలు సభను అలరింపజేశాయి. ఈ సందర్భంగా వారు పాటలకు లయబద్ధంగా వేసిన నృత్యాలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి. ఇటీవల నెల్లూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఈ పాఠశాల విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ప్రతి ఒక్కరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రి నారాయణ విద్యార్థులను అభినందించి వారికి ప్రత్యేకంగా మెమెంటోను కూడా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్లు పి. సులోచన, సునీత, స్వాతి, పీఈటీ వెంకటసుబ్బమ్మ, గీతామాధురి, తదితరులు ఉన్నారు.

## మహనీయుల స్ఫూర్తితో పంచాయతీలు మరింత అభివృద్ధిలోకి




**కోవూరు , ఆగస్టు 29 ప్రభాతవార్త** కోవూరులోని మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం పంచాయతీ అభివృద్ధి ప్రగతి సూచికలపై సర్పంచ్‌లకు ఎంపీటీసీ సభ్యులకు వివిధ శాఖల అధికారులకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగుమహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అటువంటి మహనీయుల స్ఫూర్తితో పంచాయతీలు మరింత అభివృద్ధి పథంలోకి రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీహరిరెడ్డి మండల పరిషత్ అధ్యక్షురాలు పార్వతి, , డిప్యూటీ ఎంపీడీవో శ్రీనివాసులు కార్యాలయ పర్యవేక్షకులు ఉషారాణి,తదితరులు ఉన్నారు.

## నారాయణరావుపేట లడ్డు పాట రికార్డు ధర 1.31లక్షలు



**ఆత్మకూరు, ఆగస్టు29,ప్రభాతవార్త :** వినాయక చవితి పండుగ సందర్భంగా ఆత్మకూరు పట్టణంలోని 14వ వార్డు నారాయణరావుపేటలో ఏర్పాటు చేసిన వినాయకుని విగ్రహం రికార్డులను సృష్టిస్తూ ఉంది. ఈ వినాయకునికి ముస్లిం దంపతులు పూజ నిర్వహించడం ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా సంచ లనం సృష్టిం చగా ఇప్పుడు మరో సంచలనం నమోదు కాబడింది. మూడు రోజులపాటు గణనా ధుని చేతిలో ఉంచిన లడ్డును వేలంపాట నిర్వహించగా ఈ లడ్డు ప్రసాదాన్ని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా ఉన్న ఈ ప్రాంతవాసి బొబ్బల చిన్నయ్య-బొబ్బల ధనమ్మ కుమారుడు బొబ్బల సుమన్-బొబ్బల మానస దంపతులు వీరి పిల్లలైన మనిత్‌నంద, మోక్షితగామినిలతో కలిసి 1లక్ష31వేల రూపాయలకు వేలంపాటలో లడ్డూను పొందారు. గణనాధునిపై తమకున్న విశ్వాసం, భక్తితో ఈ లడ్డుని భగవంతుని ప్రసాదంగా కొనుగోలు చేశామని వేలంపాటలో 1,31,000లకు తాము పొందడం ఆ స్వామి తమకు ఇచ్చిన అదృష్టంగా భావిస్తూ లడ్డూప్రసాదాన్ని స్వీకరిస్తున్నామని వినాయకుని స్వామి ఆశీస్సులు తమకుటుంబానికి ఎల్లవేళలా లభించాలని సుమన్ తెలిపారు. బొబ్బల కుటుంబం ఈ ఏడాది లడ్డూవేలంపాటలో పొందడం ఎంతో సంతోషంగా ఉందని ఆలయ కమిటీ సభ్యులు నాగేశ్వరరావ్ తెలిపారు. వేలంపాట అనంతరం లడ్డు ప్రసాదాన్ని వీరు తలపై ధరించి మేళతాళాలతో తమ ఇంటికి తీసుకెళ్ళారు.

## కారుణ్య నియామకంలో అటెండర్ గా విధుల కేటాయింపు



**నెల్లూరు కార్పొరేషన్,ఆగస్టు 29,ప్రభాత వార్త:** నెల్లూరు నగరపాలక సంస్థలో పబ్లిక్ హెల్త్ విభాగం మేస్త్రీగా విధులు నిర్వహిస్తూ మరణించిన కె. సుబ్రమణ్యం కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించే దిశగా కారుణ్య నియామకం ద్వారా అతని కుమారుడు కె. భానుదర్‌కు అటెండర్‌గా విధులను కేటాయిస్తూ కమిషనర్ వై.ఓ నందన్ ఉత్తర్వులు జారీ చేశారు. కార్పొరేషన్ కార్యాలయం కమిషనర్ ఛాంబర్‌లో శుక్రవారం కారుణ్య నియామకం పత్రాలను భానుదర్ కమిషనర్ నుంచి అందుకున్నారు. విధుల నిర్వహణలో క్రమశిక్షణ ప్రదర్శిస్తూ, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని కమిషనర్ సూచించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నందన్ మాట్లాడుతూ వివిధ కారణాల రీత్యా కోర్టు కేసులతో పెండింగ్లో ఉన్న కారుణ్య నియామకాలను తాను కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి క్షేత్రస్థాయిలో దర్యాప్తు చేయించి కార్పొరేషన్ ఎస్టాబ్లిష్మెంట్ విభాగంలో నాలుగు, పబ్లిక్ హెల్త్, ఇంజనీరింగ్ విభాగాలలో రెండు, మొత్తం ఆరు మంది సిబ్బందిని కారుణ్య నియామకాల ద్వారా విధులలో చేర్చుకున్నామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్ నరేంద్ర, మేనేజర్ పాల్గొన్నారు.

## మున్సిపల్ షాపుల అద్దె మొండి బకాయిదారులకు హెచ్చరిక



**నెల్లూరు కార్పొరేషన్,ఆగస్టు 29,ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థకు చెందిన స్థానిక సుబేదార్ పేట ప్రాంతంలోని మున్సిపల్ ఎన్.సి బిల్డింగ్ షాపింగ్ కాంప్లెక్స్ లోని షాప్ నెంబర్ 10 నిర్వాహకులు 2017 వ సంవత్సరం నుంచి రూ 17,84,754/ అద్దె బకాయిలు ఉన్నారు. నిర్వాహకులుగా ఉన్న వారు నెల్లూరు నగరపాలక సంస్థకు బాడుగ చెల్లించకుండా ఉన్నందున, వారికి ఇదివరకే చాలా సార్లు నోటీసులు జారీ చేసినా, ఎంతకీ సంబంధిత షాపు నిర్వా హకులు స్పందించకపోవడంతో, నెల్లూరు నగరపాలక సంస్థ కమిష నర్ వై.ఓ నందన్ ఆదేశాల మేరకు, నిర్వా హకులను మొండి బకాయిలుగా పరిగణించి అధికారులు శుక్ర వారం చర్యలకు ఉపక్రమించారు. నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాలతో రెవెన్యూ ఇన్స్పెక్టర్ సి.వి.ఎస్ కిరణ్ ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బందితో కలిసి 10 వ నెంబర్ గల షాపును సీజ్ చేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్స్పెక్టర్ కిరణ్ మాట్లాడుతూ భవన యజమానులు, అద్దెదారులు సకాలంలో నగరపాలక సంస్థకు చెందిన అన్ని రకాల పన్నులను వెంటనే చెల్లించి నెల్లూరు నగరపాలక సంస్థ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సచివాలయ అడ్మిన్ కార్యదర్శి దొరబాబు, అడ్మిన్ అసిస్టెంట్లు జాకీర్, నవీన్ పాల్గొన్నారు.

## వేడుకగా గణనాధుని ఉరేగింపు



**బుచ్చి ఆగష్టు 28 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాలెం గాంధీనగర్ -2 వ వీదిలో వినాయకుడి ఉరేగింపు ఘనంగా నిర్వహించారు. మూడు రోజు స్వామి వారిని అత్యంత సుందరంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం రిజర్వాయర్ వద్ద సదరన్ చానల్‌లో నిమజ్జనం చేశారు. ప్రత్యేక పూజాకార్యక్ర మాలు అనంతరం భక్తులకు తీర్ధ ప్రసాదాలు అంద చేశారు. ఈకార్యక్రమంలో పలువురు యూత్ పాల్గొన్నారు.

## రైతుల ప్రయోజనం కొరకే వ్యవసాయ పరపతి సంఘాలు

- పేదూరు వ్యవసాయ పరపతి సంఘం ఆత్మీయ సమావేశంలో సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి



**తోటపల్లిగూడూరు, ఆగష్టు 29, ప్రభాతవార్త** రైతుల ప్రయోజనం కోసమే సహకార సంఘాలు పని చేస్తున్నట్లు సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పేదూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన సొసైటీల పుర్వాపరాలను వివరించారు. 1987లో సింగిల్ విండో రూపంలో ప్రారంభించిన సొసైటీలు మారుతున్న క్రమంలో వ్యవసాయ పరపతి సంఘాలుగా ఏర్పడి రైతులకు తక్కువ వడ్డీకి వ్యవసాయ రుణాలు, ఎరువులు సరఫరా అందిస్తున్నట్లు తెలిపారు. పేదూరు సొసైటీ గిడ్డంకి విశాలం కొరకు దాతలు ఎవరైనా ముందుకు వస్తే నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. జాఫర్ సాహెబ్ కెనాల్ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఈ గ్రామానికి ఎమ్మెల్యే ద్వారా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఈఓ రమణమూర్తితో పాటు ఛైర్ పర్సన్ గూడూరు నారాయణ డైరెక్టర్లు మేనాటి సీనయ్య, దేవరాల ప్రవీణ్, తోటపల్లిగూడూరు సహకార బ్యాంక్ అధ్యక్షులు సన్నారెడ్డి సురేష్‌రెడ్డి, రైతు నాయకులు రాధాకృష్ణారెడ్డి, మండల అధ్యక్షులు కొణతం రఘు బాబు, సీనియర్ నాయకులు ముత్యాల శ్రీనివాసులు, అన్నం శ్రీనివాసులు, మొద్దు శ్రీనివాసులు, మన్యం గౌడ్, తలమంచి నాగేశ్వరరావు, గండవరపు సోమశేఖర్‌రెడ్డి, మాగుంట రమణారెడ్డి, బి.నవీన్, ఎస్.శి వయ్య, పి.రాధాకృష్ణ, అన్నం నవీన్, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే కుటుంబాన్ని పరామర్శించడానికి వస్తున్న నేతలను అడ్డుకోవడం దారుణం



**కావలి, ఆగస్టు 29, ప్రభాతవార్త:** కావలి నియోజకవర్గం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్, మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించేదుకు వస్తున్న ముఖ్య నేతలను అడ్డుకోవడం దారుణమని కావలి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు కావల పట్టణంలోని ఆర్ ఎస్ ఆర్ కళ్యాణ మండపం నందు శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు, జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు కనమర్లపూడి వెంకటనారాయణ, మాజీ మండల అధ్యక్షురాలు పర్రి మహేశ్వరి లు మాట్లాడారు మాజీ శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పై అక్రమంగా కేసులు బనాయించడం జరిగిందని వారి కుటుంబ సభ్యులను పరామర్శించేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలను పోలీసులతో అడ్డుకోవడం ఏమి సాంప్రదాయమన్నారు ఇలాంటి కార్యక్రమాలకు టిడిపి నాయకులు పాల్పడటం ఏంటని నారు కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి ని ఇతర ముఖ్య నాయకులను కావలి టోల్గేట్ దాటి రండి చూసుకుందామని ఛాలెంజ్ చేయడం జరిగిందని దానికి ప్రతీకగా వారందరూ రావడానికి సిద్ధమైతే కావలి పట్టణంలోకి రానీయకుండా పట్టణాన్ని పోలీసులతో అష్టదిగ్బంధం చేయడం ఏంటని ప్రశ్నించారు ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి క్వారీలో విధమైన అవినీతి అక్రమాలు జరుగుతున్నాయో ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతిపక్ష పార్టీ అయిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మీద ఉందని దీని కోసంగా చలో అన్నవరం క్వారీ కార్యక్రమాన్ని మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి సూచన మేరకు చేపట్టదలుచుకోవడం జరిగిందన్నారు ఈ విధంగా పోలీసులతో అడ్డుకోవడం మంచి సంప్రదాయం కాదన్నారు ప్రతిపక్షాలు సోషల్ మీడియా వారు ప్రశ్నిస్తే వారి మీద రౌడీషీట్లు ఓపెన్ చేయడం జరుగుతుందని అన్నారు అధికారం ఉందని ఎవరిమీదంటే వారి మీద అక్రమ కేసులు రౌడీషీట్లు ఓపెన్ చేయడం మంచి సాంప్రదాయం కాదన్నారు కావలి ప్రశాంతమైన ప్రాంతం అని విద్వేషాలు రెచ్చగొట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూడటం మంచి పద్ధతి కాదన్నారు కాకాని గోవర్ధన్ రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి లపై నీచమైన భాషతో మాట్లాడటం జరిగిందని 84 రోజులు కాకాని గోవర్ధన్ రెడ్డి జైల్లో ఉన్నారని అన్నారు మీ నాయకుడు కూడా జైల్లో ఉన్నారని అది తెలుసుకొని మాట్లాడాలన్నారు కాకాని గోవర్ధన్ రెడ్డి ఎక్కడ కూడా నాకు అనారోగ్యం సరిగా లేదు బెయిల్ ఇవ్వండి అని అడగలేదని నా మీద అక్రమ కేసులు బనాయించారని చెప్పడం జరిగిందన్నారు అదే రీతిలో మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి మీద కూడా అక్రమ కేసులు బనాయించడం జరిగిందన్నారు బాధితులం మేమని రౌడీషీట్లు టిడిపి నాయకులు మీద ఓపెన్ చేయాలని అంతేకానీ మా మీద అక్రమ కేసులు పెట్టి రౌడీషీట్లు ఓపెన్ చేయటం ఏంటని ప్రశ్నించారు ఎమ్మెల్యేగా ఉన్నవారు హుందాగా మాట్లాడాలని అంతేకానీ ఈ విధంగా మాట్లాడటం ఏంటని భాష మార్చుకోవాలని తెలియజేశారు టిడిపి పాలనలో కావలిలో జరుగుతున్న దౌర్జన్యాలు అక్రమాలను కావలి ప్రజలు చూస్తున్నారని ఒకసారి గెలిచిన ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి పాలన ఏ విధంగా ఉందో రెండుసార్లు గెలిచిన మాజీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి పాలన ఏ విధంగా ఉందో ప్రజలు గమనించాలని తెలియజేశారు ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## అన్నదానం చేసిన చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ దంపతులు

**బుచ్చి ఆగష్టు 29 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం నగర పాలక పంచాయితీలోని బలరాం నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి





విగ్రహం వద్ద చైర్‌పర్సన్ మోర్ల సుప్రజా మురళీ దంపతులు కుటుంబ సమేతంగా గణనాధునికి పూజలు నిర్వహించారు. అనంతరం సుప్రజా ,మురళీ పేదలకు పెద్దఎత్తున అన్నదానం చేశారు. ఏటా బలరాం నగర్‌లో ఎంతో కోలహలంగా గణనా ధునికి పూజలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించడంజరుగు తుందని నిర్వాహకులు తెలిపారు. ప్రజలు పాల్గొని సహపంక్తి బోజనం చేశారు.






## శివాజీ సెంటర్ గణేశ్ ప్రతిమను దర్శించిన మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు



**నెల్లూరు అగ్రికల్చర్, ఆగష్టు 29, ప్రభాతవార్త** నెల్లూరు గాంధీ బొమ్మ వద్ద శివాజీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణేశ్ ప్రతిమను మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్య నాయుడు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విఘ్నేశ్వరుని ఆశీర్వాదాలు తీసుకుని, మీడియాతో మాట్లాడుతూ గణేశ్ ఉత్సవాలు ప్రాధాన్యాన్ని వివరించారు. గణేశ్ ప్రతిమను ఇక్కడ ఆవిష్కరించి పూజా కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో ఆధ్యాత్మిక భావన ,దైవచింతన, సద్బుద్ధి, సత్ప్రవర్తన, సన్మార్గం మరింత పెరుగుతున్నాయన్నారు. విఘ్నాలు తొలగించేందుకు గణనాధుని ఎల్లప్పుడూ ప్రార్థించాలని వెంకయ్య నాయుడు తెలిపారు. భారతదేశం ప్రపంచ దేశాల మధ్య శక్తివంతమైన దేశంగా వేగంగా ఎదుగుతోందని పేర్కొంటూ మన దేశం పురోగతిని చూసి ఓర్చుకోలేని కొన్ని దేశాలు తప్పుడు ప్రచారాలు చేస్తూ ఆటంకాలు సృష్టిస్తున్నాయని వివరించారు. ఆ ఆటంకాలన్నీ తొలగిపోయి భారత్ మరింత శక్తివంతంగా ప్రపంచానికి తలమానికంగా నిలవాలని కోరుకుంటున్నానని వెల్లడించారు. సర్వేజనా: సుఖినోభవంతు అనే మన ప్రాచీన ధార్మిక భావన మరింతగా పెంపొందాలని నా మనస్ఫూర్తి అభిలాష అని అన్నారు. ఈ సందర్భంగా యువత ఉత్సాహంగా పాల్గొనడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ప్రచార ఆడంబరాలను తగ్గించి, ఆధ్యాత్మిక భావనను పెంపొందించాలని సూచించారు. సన్మార్గం, సత్ప్రవర్తనతో ముందుకు నడిచి దేశాన్ని శక్తివంతం చేయడానికి అందరం కలిసికట్టుగా కృషి చేయాలి అని పిలుపునిచ్చారు. వినాయక చవితి ఉత్సవాల చరిత్రను ప్రస్తావిస్తూ, స్వాతంత్ర్యోద్యమ కాలంలో శ్రీ బాల గంగాధర్ తిలక్, గణేశ్‌ను ఇంటి పూజల నుంచి సామూహిక పండుగగా మార్చారని, అప్పటి నుంచి సామూహిక గణేశ్ ఉత్సవాల సంప్రదాయం విజయవంతంగా కొనసాగుతోందన్నారు. యువతలో సానుకూల ఆలోచనలను పెంపొందించేందుకు సమాజాన్ని సక్రమ దిశగా నడిపించేందుకు ఈ ఉత్సవాలు మార్గదర్శకంగా నిలుస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఆమంచర్ల శంకర్ నారాయణ, సురేందర్‌రెడ్డి, ఏవీ సూరి, మూర్తి, పాత మిత్రులతో కలిసి కార్యక్రమంలో పాల్గొన్నారని పేర్కొన్నారు. ఈ ఉత్సవాలను మరింత విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. వినాయకుడు ప్రకృతి సౌందర్యం, సమతుల్యతకు ప్రతీక, ప్రకృతితో మేళవించి జీవించడం అలవాటు చేసుకోవాలి. ప్రకృతిని పరిరక్షిస్తూ, సర్వ ప్రాణుల హితం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి, నెల్లూరు జిల్లా పురోగతికి తన ఆకాంక్షను వ్యక్తం చేస్తూ ఆకలి, అవినీతి, ఆకృత్యాలు, అత్యాచారాలు లేని సమాజం నిర్మాణం కోసం మనందరం కలిసి పని చేయాలని కోరారు. దేవతల గణనాథుడు విఘ్నేశ్వరుడు మనందరికి ఆశీస్సులు ప్రసాదించాలని కోరుకుంటున్నానని వెంకయ్యనాయుడు అన్నారు. చివరిగా ఈ పూజా కార్యక్రమానికి ఆతిథ్యం ఇచ్చిన శివాజీ సెంటర్ గణేశ్ మిత్ర మండలికి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు.

## మంత్రి నారాయణను కలిసిన కావలి పురపాలక పాఠశాలల ఉపాధ్యాయులు



**కావలి, ఆగస్టు 29, ప్రభాత వార్త:** పురపాలక విద్యా శాఖ, పాఠశాల విద్యాశాఖలో కలిసినందున పాఠశాల విద్యాశాఖకు సంబంధించిన మార్గదర్శకాలను అమలు చేయడం కారణంగా పురపాలక ఉపాధ్యాయులు బదిలీ కాకుండా ఆగిపోయినందున శుక్రవారం కావలి పురపాలక ఉపాధ్యాయులు పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ను నెల్లూరులోని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రాన్ని అందజేయడం జరిగింది ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడారు ఎంతో కాలం నుండి ఎదురుచూస్తున్న పురపాలక ఉపాధ్యాయుల అంతర్ జిల్లా బదిలీలు ప్రభుత్వం ఈనెల 20వ తేదీన జీవో జారీ చేసి ఈనెల 27వ తారీకు దాకా దరఖాస్తుల స్వీకరించింది. కానీ పాఠశాల విద్యాశాఖ బదిలీ అర్హతల్లో ఒకే యాజమాన్యం కు అవకాశం ఇవ్వడం కారణంగా అనేకమంది పురపాలక ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకునేటువంటి అవకాశం లేకుండా పోయిందన్నారు.పురపాలక విద్య, పాఠశాల విద్యా పరిధితో పోల్చుకుంటే చాలా చిన్నదని మరియు పరిమితమని అందుకని ఒకే జిల్లాలో మరియు వేరు వేరు జిల్లాలలో పురపాలక పాఠశాలలలో పని చేస్తున్నటువంటి ఉపాధ్యాయులు నగర పాఠశాలలకు మరియు నగరపాలక పాఠశాలలో పనిచేస్తున్నటువంటి ఉపాధ్యాయులు పురపాలక పాఠశాలలకు కనీసం స్పౌజ్ మరియు పరస్పర బదిలీలకు అవకాశం కల్పించాలని కోరారు. 2018 వ సంవత్సరంలో ఈ ప్రభుత్వం మునిసిపల్ ఉపాధ్యాయులకు 506,507 జీవోల ప్రకారంగా బదిలీలు నిర్వహించడం జరిగినది అన్నారు. కానీ ఇప్పుడు అలా అవకాశం కల్పించని కారణంగా పురపాలక పరిధిలో అంతర్యాజమాన్య బదిలీలు జరగని కారణంగా కొంతమంది ఉపాధ్యాయులు నష్టపోయారన్నారు ఇప్పటికైనా అవకాశం కల్పించకపోతే భార్యాభర్తలు, తల్లిదండ్రులకు దూరంగా, ఒక దగ్గరకు వచ్చే అవకాశం ఇప్పుడల్లా ఇక ఉండదని అవకాశం కల్పించాలని మంత్రిని కారణం జరిగిందన్నారు .దీనిపై మంత్రి స్పందిస్తూ మానవుల శాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లి తగు న్యాయం చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు ఈ కార్యక్రమంలో కావలి పురపాలక ఉపాధ్యాయులు టి.కొండారెడ్డి, కిరణ్ కుమార్, శిరీష, శ్రీను, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## పీఆర్ఎన్‌లో శుభదిన్ కా తిథి భోజన్



**కోవూరు , ఆగష్టు 29 ప్రభాత వార్త :** కోవూరులోని పచ్చిపాల రామనాథమ్మ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఉపాధ్యాయురాలు ఝాన్సీరాణి 31వ తేదిన పదవీ విరమణ చేయనుంది. ఈ నేపథ్యంలో శుక్రవారం ఆ ఉపాధ్యాయురాలు శుభదిన్ కా తిథిభోజన్‌లో భా గంగా విద్యార్థులందరికీ మంచి భోజనాన్ని అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఆమెను ప్రత్యేకంగా అభినందించారు.

## ఏఎంసీ డైరెక్టర్‌గా గునుకుల విజయలక్ష్మి ప్రమాణ స్వీకారం



**నెల్లూరు, ఆగష్టు 29 ప్రభాతవార్త- విద్య** కూటమి గెలుపు కోసం అహర్నిశలు శ్రమించి, విజ యానికి కృషి చేసిన జనసేన వీర మహిళ,జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గునుకుల కిషోర్ సతీ మణి గునుకుల విజయలక్ష్మి నెల్లూ రు ఏఎంసి డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసారు. నగరంలోని స్థానిక పిచ్చిరెడ్డి కళ్యాణ మండపంలో జరిగిన నెల్లూరు వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవంలో ఛైర్మెన్, వైస్ ఛైర్మెన్, మిగతా డైరెక్టర్లతో కలిసి గునుకుల విజయలక్ష్మి ప్రమాణ స్వీకారం చేసారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం, వ్యవసాయ అభివృద్ధి కోసం శ్రమిస్తామన్నారు. మార్కెట్లో రైతులు ఎదుర్కొనే ఇబ్బందులను తగ్గించే విధంగా, పారదర్శకతతో నిర్ణయాలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.. రైతుల కోసం సదుపాయాలను విస్తరించి, వ్యవసాయ రంగం మరింత లాభదాయకంగా మారేలా కమిటి కష్టపడుతుందని, ఈ బాధ్యతను జనసేన పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా నిర్వర్తిస్తానని తెలిపారు. ఈ గౌరవప్రదమైన అవకాశం నాకు లభించడం వెనుక నా కుటుంబం, పార్టీ కార్యకర్తలు, నాయకుల కృషి ఉందని. జనసేనకు అండగా నిలబడి పనిచేసిన ప్రతి కార్యకర్త ఈ విజయంలో బాగస్వామ్యమని అన్నారు. అలాగే నెల్లూరు ఏఎంసి ఛైర్మన్‌గా మనుబోలు శ్రీధర్ రెడ్డి, వైస్ ఛైర్మన్‌గా రాపూరు చంద్రశేఖర్, అలాగే డైరెక్టర్లుగా బాధ్యతలు స్వీకరించిన అందరికీ ఆమె శుభాకాంక్షలు తెలిపారు. అలాగే తనకు ఇటువంటి గొప్ప అవకాశం ఇచ్చిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి , ఏపీ టైటికో ఛైర్మన్ వేములపాటి అజయ కుమార్, రాష్ట్ర వక్ఫ్ బోర్డు ఛైర్మెన్ అబ్దుల్ అజీజ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం రూరల్ నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, తెలుగుదేశం సిటీ నాయకులు విజయభాస్కర్ రెడ్డి, జనసేన నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, తదితర జనసేన నాయకులు, టిడిపి నాయకులు, బిజెపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వాసవీ నగర్‌లో వేడుకగా గణనాధుడి వేడుకలు



**బుచ్చి ఆగష్టు 29 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెంలోని వాసవీ నగర్‌లో వినాయక చవితి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి.స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్ధ ప్రసాదాలు అందజేశారు .పచ్చి పులుసు సురేష్ భార్గవి,కుటుంబసభ్యులు సహపంక్తి బోజన కార్యక్రమాన్ని నిర్వహించారు. కోలహలంగా ఉట్టి కార్యక్రమాన్ని నిర్వహించారు. యువకులు కోలహలంగా రంగులు చల్లుకుంటు ఉట్టికొట్టారు. అనంతరం లడ్డు వేలం పాటను నిర్వహించారు. వాసవీ యూత్ 32 వేల 116 రూపాయాలకు లడ్డును దక్కించుకుంది. ఈ సందర్భంగా ఇనుగూరు సుబ్బారావు మాట్లాడుతు గత పది సంవత్సరాలుగా వాసవీ నగర్‌లో వినాయక చవితి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా పచ్చిపులుసు సురేష్ దంపతుల ఆద్వర్యంలో సహపంక్తి బోజనం ఏర్పాటు చేశారు.వాసవీ యూత్ దరిశి మహేష్, అచ్యుత్ దినేష్, దరిశి హరి, గోనుగుంట అరుణ్, క్రిష్ణం సుధా కిరణ్ లడ్డు దక్కించుకున్నారు. పూలమాల వేలం పాట ఏకదంత యూత్ దక్కించుకున్నారు. ఈకార్యక్రమానికి మార్గదర్శకులు సీనియర్ బిజెపి నాయకులు ఇనుగూరు బాలయ్య వ్యవహారించారు.కార్యక్రమ నిర్వాహకులుగా రాచూరు మాల్యాద్రి, ఇనుగూరు సుబ్బారావు, ముత్యాల శ్యామ్ సుందర్, ముత్యాలరాజ్,పచ్చిపులుసు సుమన్, చెక్కా సురేంద్ర, యశ్వంత్,దరిశిహరి, గాదంశెట్టి అశోక్, సుజిత్, హరిసాయి తదితరులు వ్యవహారించారు. స్వామి వారికి వేసే మాలను సిద్ది విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద నుండి పెద్దఎత్తున ఉరేగింపుగా అమ్మవారి ఆలయం వరకు తీసుకొని వచ్చారు.ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున యువకులు పాల్గొన్నారు.



## మంత్రి వర్గ ఉపసంఘం దృష్టికి తెస్తా : ఎమ్మెల్యే



**ఉదయగిరి, ఆగష్టు 29, ప్రభాతవార్త** జిల్లాల పునర్విభజనపై శనివారం మంత్రి వర్గ ఉప సంఘం నెల్లూరు జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా ఉదయగిరి జిల్లా ఏర్పాటుపై స్పందించి ఉప సంఘం దృష్టికి తీసుకెళ్లాలని ఉదయగిరి జిల్లా సాధన కమిటీ ఉదయగిరి శాసనసభ్యులు కాకర్ల సురేష్ దృష్టికి తెచ్చారు. శుక్రవారం వింజమూరు మండలం నల్లగొండ్ల గ్రామంలో పర్యటన సందర్భంగా ఉద్యమ నాయకులు ఆయనను కలిసి మెమోరాండం ఇచ్చారు. ఉదయగిరి రెవెన్యూ డివిజన్‌పై సానుకూలంగా స్పందించిన కాకర్ల జిల్లా డిమాండ్‌పై పట్టుబట్టాలని వారు కోరారు. ఉదయగిరి పరిసర 21 మెట్ట మండలాలను కలిపి జిల్లా చేయమని ఉప సంఘానికి డిమాండ్ చేయాలని వారు కోరారు. శాసనసభ్యుని కలిసిన వారిలో ఉదయగిరి జిల్లా సాధన కమిటీ నాయకులు ఎండీ ఖాజా, శ్రీరామచంద్రమూర్తి, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎల్సీ రమణారెడ్డి, బీజేపీ జిల్లా నాయకులు ఎం.బాలకృష్ణరెడ్డి, నారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

## బంగారు పతకం విజేతకు సన్మానం



**కోవూరు , ఆగష్టు 29 ప్రభాతవార్త :** కోవూరులోని చైతన్య యోగా కేంద్రంలో శుక్రవారం యోగా అభ్యసకురాలు మాస్టర్‌గా ఉన్న ప్రసన్న ఈ నెల 21,22,23 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ఒక బంగారు పతకం, ఒక కాంస్య పతకం కైవసం చేసుకుంది. ఈ మేరకు ఆమెను శాలువా, మెమెంటోతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా నియమింపబడిన యోగా గురువు ప్రముఖ న్యాయవాది సలీమ్‌ను కూడా ఈ సందర్భంగా మెమెంటో శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో యోగా గురువులు జనార్ధన్, రమణయ్య, రిటైర్డ్ ఎంపీడీవో జయరామయ్య, తదితరులు ఉన్నారు.

## అల్జీమర్స్ - డిమోన్షియాపై అవగాహన

- వృద్ధాప్యంలో నిర్లక్ష్యం చేయరాని సమస్య



**నెల్లూరు, ఆగష్టు 29, ప్రభాతవార్త –వైద్యం** వయసు పెరిగేకొద్ది జ్ఞాపకశక్తి మందగించడం సహజమే. అయితే ఇది కొన్ని సందర్భాల్లో డిమోన్షియా అనే సమస్యకు దారితీస్తుంది. చాలా మంది డిమోన్షియా, అల్జీమర్స్ ఒకటే అని భావిస్తారు. కానీ వాస్తవానికి డిమోన్షియా అనేది మెదడు పనితీరులో క్షీణతను సూచించే సాధారణ పథం. అల్జీమర్స్ మాత్రం డిమెన్షియాకు ప్రధాన కారణం. సుమారు 60-80 శాతం కేసుల్లో అల్జీమర్స్ వల్లే డిమెన్షియా వస్తుంది.

**డిమెన్షియా అంటే ఏమిటి:** డిమెన్షియా ఒకే వ్యాధి కాదు. ఇది జ్ఞాపకశక్తి, ఆలోచన, భాష, ప్రవర్తన, రోజువారి పనులను నిర్వర్తించే సామర్థ్యంలో తగ్గుదల కలిగించే సమస్యల సమూహం. అందులో అల్జీమర్స్ వ్యాధి, వాస్కులర్ డిమెన్షియా, లెవీ బాడీ డిమెన్షియా వంటి రకాలు ఉన్నాయి.

**గుర్తించదగిన లక్షణాలు:** ఇటీవల సంఘటనలు మరచిపోవడం ప్రవర్తనలో మానసిక స్థితిలో మార్పులు రోజువారి పనులను పూర్తి చేయడంలో ఇబ్బందులు మాటల్లో తడబాటు సమయం, ప్రదేశం గుర్తించ లేకపోవడం. డాక్టర్ దీక్షాంతి నారాయణ్‌మెడికవర్ హాస్పిటల్స్ నెల్లూరు, న్యూరాలజిస్టు అభిప్రాయం అల్జీమర్స్‌కు పూర్తిస్థాయి చికిత్స లేనప్పటికి, సరైన సమయంలో గుర్తించి మందులు వాడడం, జీవనశైలిలో మార్పులు చేయడం ద్వారా వ్యాధి పురోగతిని గణనీయంగా తగ్గించవచ్చు. ఆరోగ్యకరమైన ఆహారం, వ్యాయామం, మానసిక ఉద్దీపన, కుటుంబం- స్నేహితులతో సాన్నిహిత్యం, ఈ సమస్యను నియంత్రించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయి అని మెడికవర్ హాస్పిటల్స్, నెల్లూరు న్యూరాలజీ విభాగ వైద్యులు తెలిపారు.

**ముఖ్యమైన సూచనలు:** పండ్లు, కూరగాయాలు, తృణధాన్యాలు చేపలతో కూడిన ఆహారం క్రమం తప్పని శారీరక వ్యాయామం పుస్తకాలు చదవడం, పజిల్స్ ఆడడం వంటి మానసిక వ్యాయామం తగినంత నిద్ర. ప్రారంభ దశలోనే లక్షణాలను గుర్తించి చికిత్స తీసుకోవడం ద్వారా రోగులు మెరుగైన జీవన నాణ్యతను పొందవచ్చు.